



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 272 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 23 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో

## ఆయనకే క్లారిటీ లేదు

వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. విజయవాడ సాయికృష్ణ అదృశ్యం కేసు అంశంపై పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై అంబటి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వం బాధితులకు న్యాయం చేస్తామని చెబుతుంటే... మరోవైపు సాయికృష్ణను ఒక క్రిమినల్ మిగతా .. 2లో..

అమెరికాకు

## షాకిచ్చిన చైనా

కీలక కంపెనీలపై ఆంక్షలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనా ఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర-మిలిటరీ వినియోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో మిగతా .. 2లో..

మా సోయా కొంటే

## ఇరాన్ ఆస్తులు విడిపిస్తాం

జేడీ వాన్స్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో శాశ్వత శాంతి స్థాపన దిశగా మరో ముందడుగు పడిందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య యుద్ధానికి శాశ్వత ముగింపు పలకడమే లక్ష్యంగా ఆ దేశంతో జరిపిన చర్చలు తుది ఒప్పందానికి మంచి పునాది వేశాయన్నారు. దీనివల్ల అమెరికా ప్రజలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తమ సోయా, మొక్కజొన్న, గోధుమలను టెహ్రాన్ కొనుగోలు చేస్తే.. దానికి బదులుగా విదేశాల్లో ఉన్న ఇరాన్ ఆస్తులు విడిపిస్తామని మిగతా .. 2లో..

పవన్‌పై వ్యాఖ్యలు..
దువ్వాడ శ్రీనివాస్‌ను

## విచారిస్తున్న పోలీసులు



**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే కేసులో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ శ్రీకాకుళం జిల్లా కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు హాజరయ్యారు. ఈ క్రమంలో పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దువ్వాడ శ్రీనివాస్ భారీ సంఖ్యలో తన అనుచరులను వెంటబెట్టుకుని కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అయితే విచారణకు అంతమంది రావడంపై పోలీసులు మిగతా .. 2లో..

కుట్రలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం..

# అప్రమత్తంగా ఉండాలి

- కొన్ని పార్టీలు ప్రతి అంశానికి కుల, మత రంగు పులుముతున్నాయని ఆరోపణ
- ప్రజా సమస్యల పరిష్కారంలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచన
- ఉద్యోగులు, అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశం
- రాష్ట్రంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపు
- అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. ప్రతి సంఘటనకు కుల, మత రంగు పులిమి, వివాదాస్పదం చేయడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు దుష్ప్రచారం, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. సోమవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. విద్వేషాలను రెచ్చగొట్టేలా సాగుతున్న తప్పుడు ప్రచారాలను, ఘటనలను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. ఇటీవల జరిగిన కొన్ని నేరాలకు మానసిక సమస్యలు, మరికొన్నింటికి గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం కారణమని ఆయన విశ్లేషించారు. ప్రభుత్వం పాత కేసులను సైతం పరిష్కరిస్తోందని, 2019లో జరిగిన నేరాలను ఇప్పుడు గుర్తించి నిందితులను పట్టుకుని శిక్షలు పడేలా చేస్తున్నామని తెలిపారు. తప్పు చేసిన వారు చట్టం నుంచి తప్పించుకోలేరనే వాస్తవాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. వాహనాల నంబర్ ప్లేట్ల విషయంలో నిబంధనలను కఠినంగా అమలు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగానే నంబర్ ప్లేట్లు ఉండేలా చూడాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి సాంకేతికత కీలకమని, ఈ నేపథ్యంలో క్వాంటం ఆర్క్, సెమీకండక్టర్ పార్క్ ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో క్వాంటం కంప్యూటర్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. పచ్చదనం పెంపు, పరిశుభ్రత, జలభద్రత, భూగర్భ జలాల రీఛార్జ్, నదుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మిగతా .. 2లో..

ఎక్కువ ఎంపీలుంటే మాట గట్టిగా

## వినిపించడానికి వీలవుతుంది

ఢిల్లీలో టీడీపీకి ప్రత్యేక గుర్తింపుపై స్పందించిన నారా లోకేశ్



**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్రంలో ఎన్డీయే కూటమిలో టీడీపీ కీలక భాగస్వామిగా ఉన్న నేపథ్యంలో, ఢిల్లీలో ఆ పార్టీకి ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందన్న ప్రచారంపై ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టత ఇచ్చారు. న్యూఢిల్లీలో రిపబ్లిక్ టీవీ నిర్వహించిన కాంక్లేవ్‌లో ఎడిటర్-ఇన్-చీఫ్ ఆర్నాబ్ గోస్వామి అడిగిన సూటి ప్రశ్నకు ఆయన అంతే సూటిగా, వివరణాత్మకంగా సమాధానమిచ్చారు. "ఎన్డీయేలో మీరే అతిపెద్ద మిత్రపక్షం కాబట్టి, మీకు ఢిల్లీలో స్పెషల్ ట్రీట్‌మెంట్ లభిస్తోందన్న ప్రచారం నిజమేనా?" అని ఆర్నాబ్ ప్రశ్నించారు. దీనిపై లోకేశ్ బదులిస్తూ, "ఆర్నాబ్ జీ, ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల మన మాట గట్టిగా వినిపించడానికి కచ్చితంగా ఉపయోగపడుతుంది. కానీ దానివల్ల రాష్ట్రానికి, నాకు వ్యక్తిగతంగా ఏం లాభం కలిగింది? ప్రధాని నరేంద్ర మోదీ గారితో కలిసి డిన్నర్ చేసే అవకాశం దొరికింది. ఆయన ఎంతో ప్రేమగా ఆతిథ్యం ఇచ్చారు. ఆయన దార్శనికత ఏంటో నాకు అర్థమైంది. కేంద్రం అద్భుతమైన పాలసీలు తీసుకొస్తుంటే, వాటిని అమలు చేయాల్సింది రాష్ట్రాలే. ఆ విషయంలో ఏపీ వేగంగా ముందుకెళుతోంది, అందుకే మాకు గుర్తింపు వస్తోంది" అని తెలిపారు.

### స్పీడే మా బలం

రాష్ట్ర ప్రభుత్వ పనితీరు వేగాన్ని వివరిస్తూ, "ఇతర రాష్ట్రాలు ఆలోచిస్తున్నప్పుడు, నేను రక్షణ మంత్రి వద్దకు వెళ్లి 'మాకు ప్రాజెక్ట్ ఇవ్వండి, భూమి సిద్ధంగా ఉంది' అని అడిగితే ఆయన ఎందుకు కాదంటారు? కేవలం 37 రోజుల్లో 600 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఇచ్చింది. ఇదే మా స్పీడ్. వేగంగా పనిచేసే రాష్ట్రాల వైపే ప్రధాని కూడా చూస్తున్నారు. రాష్ట్రాలు పోటీ పడితేనే దేశం గెలుస్తుందని నా నమ్మకం" అని లోకేశ్ అన్నారు. చంద్రబాబు ఐటీకి బ్రాండ్ అయితే, మీరు ఏఐకి బ్రాండ్‌గా మిగతా .. 2లో..

క్యాన్సర్ బాధితులకు

## బసవతారకం ఆసుపత్రి ఓ భరోసా



కేంద్రమంత్రి అనుప్రియ పటేల్

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** క్యాన్సర్ బాధితులకు బసవతారకం ఆసుపత్రి ఓ భరోసా అని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్ అన్నారు. ఇక్కడ చాలా తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తున్నారని చెప్పారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. "దేశంలో ఏటా 15లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. దీన్ని తొలి దశలో గుర్తించడం చాలా కష్టం. 30ఏళ్లు దాటిన వారికి ఆయుష్మాన్ భారత్ కింద ఉచితంగా దీనికి సంబంధించిన పరీక్షలు చేస్తున్నాం. దేశంలో 6 కోట్ల మంది మహిళలు బ్రెస్ట్, 9 కోట్ల మంది సర్వైకల్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సర్వైకల్ క్యాన్సర్ రాకుండా మహిళలు, బాలికల కోసం మోదీ ప్రభుత్వం హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకొచ్చింది. 14 ఏళ్లలోపు ఉన్న 1.20 కోట్ల మంది బాలికలకు ఈ వ్యాక్సిన్ వేస్తున్నాం. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో దీన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఒకప్పుడు 8 మాత్రమే ఉన్న ఎయిమ్స్ ఆసుపత్రులు.. ఇప్పుడు 23కు చేరాయి" అని మిగతా .. 2లో..

సంధ్య థియేటర్ ఘటన..

## వర్చువల్‌గా కోర్టుకు హాజరైన అల్లు అర్జున్

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సంధ్య థియేటర్ ఘటన కేసులో సినీనటుడు అల్లు అర్జున్ నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరినట్లు సమాచారం. ఈ క్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి ఇవాళ కోర్టుకు హాజరుకావాలని 19 మంది నిందితులకు ఇటీవల నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో నిందితులంతా మిగతా .. 2లో..

డబ్బులేక ఏ ఒక్కరూ

## క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు

ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోజుకి 35 నుంచి 40 శస్త్రచికిత్సలు చేస్తున్నామని.. వేలాది మందికి ఇది ఓ ఆశా కిరణమని చెప్పారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. "నటుడిగా, ఎమ్మెల్యేగా కాదు.. ఓ కొడుకుగా మీ ముందు నిలుచున్నా. మా అమ్మ బసవతారకం క్యాన్సర్ బారిన పడినప్పుడు ఎంతో బాధపడ్డాం. డబ్బు ఉంది కాబట్టి గట్టిగా పోరాడగలిగాం. డబ్బు లేని వారు ఈ వ్యాధితో ఎలా పోరాడుతారని మా అమ్మ ప్రశ్నించారు. అప్పుడే ఈ ట్రస్ట్ ఏర్పాటు మిగతా .. 2లో..

## దేవుడి సొమ్ము దేవుడికే.. సనాతన ధర్మ రక్షణే లక్ష్యం

2027 జూన్ 26 నుండి గోదావరి పుష్కరాలు - మార్చి నాటికే 71.60 కోట్లతో 162 ఆలయాల పునర్నిర్మాణ పనులు పూర్తి

మేనిఫెస్టోలోని 11 హామీల్లో కేవలం రెండేళ్లలోనే 10 అమలు చేసి చూపించాం : మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే దేవాదాయ ధర్మాదాయ శాఖను సంపూర్ణంగా ప్రక్షాళన చేసి, ఏపీని నూతన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. గత వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల అస్తవ్యస్త పాలనలో ఒక్క విభాగానికి కూడా అధిపతి లేకుండా దేవాదాయ శాఖను నిర్వీర్యం చేశారని, లడ్డూ ప్రసాదం కల్తీ, రామతీర్థం, అంతర్వేది రథం దహనం వంటి అపచారాల చీకటి రోజుల నుంచి ఆలయాలను విముక్తం చేసి, భక్తులలో నమ్మకాన్ని, విశ్వాసాన్ని నూటికి నూరు శాతం పెంపొందించామని ఆయన స్పష్టం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి మీడియా సమావేశంలో మిగతా .. 2లో..

## రైతులకు ఎరువుల కొరత ఉండదు

డీలర్లు, కంపెనీలకు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టమైన హెచ్చరిక - బలవంతపు ఎరువుల విక్రయాలపై ఉక్కుపాదం

ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు, ఎరువుల అక్రమాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖరీఫ్-2026 వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎరువుల లభ్యత, పంపిణీ, నిల్వలు, సరఫరా పరిస్థితులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ఎరువుల తయారీ సంస్థల ప్రతినిధులు, డీలర్ల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు అవసరమైన మేరకు మాత్రమే కాకుండా, అవసరానికి మించి కూడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా యూరియా సరఫరాలో ఎటువంటి కొరత లేకుండా అధికారులు, కంపెనీలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. యూరియా లేదా డీఏపీ కొనుగోలు చేసే రైతులకు బలవంతంగా కాంప్లెక్స్ మిగతా .. 2లో..

వెంకటేశ్, కల్యాణ్ రామ్ సినిమా పేరుతో

## నకిలీ క్యాస్టింగ్ కాల్స్

మోసగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించిన నిర్మాణ సంస్థ



**విశ్వం వాయిస్ న్యూస్ :** విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ హీరోలుగా దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న కొత్త సినిమా పేరుతో కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. ఈ సినిమాలో నటీనటులు కావాలంటూ ఆన్‌లైన్‌లో నకిలీ క్యాస్టింగ్ కాల్స్ ప్రచారం చేస్తుండటంతో చిత్ర నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్ స్టూడియోస్ అప్రమత్తమైంది. ఇది పూర్తిగా మోసపూరిత చర్య అని, ఎవరూ నమ్మవద్దని స్పష్టం చేస్తూ సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. "మా సినిమా పేరుతో కొన్ని నకిలీ క్యాస్టింగ్ కాల్స్ ప్రచారంలో ఉన్నట్టు మా దృష్టికి వచ్చింది. అవి పూర్తిగా అవాస్తవం. వాటిని నమ్మి మీ వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, మిగతా .. 2లో..

ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో

## నారా భువనేశ్వరి బర్త్‌డే వేడుకలు

- త్వరలో విజయవాడలో తలసేమియా కేర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన
- పిల్లలతో కేక్ కట్ చేసి, వారితో కలిసి భోజనం చేసిన భువనేశ్వరి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తన పుట్టిన రోజును సోమవారం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల మధ్య జరుపుకున్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి, వారికి బహుమతులు, చాక్లెట్లు పంచిపెట్టారు. అనంతరం వారితో కలిసి భోజనం చేస్తూ ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి కీలక ప్రకటన చేశారు. త్వరలోనే విజయవాడలో కొత్తగా తలసేమియా కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు మిగతా .. 2లో..

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో

## రేవంత్, కిషన్‌రెడ్డి భేటీ



**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి రైల్వేమంత్రితో రైల్ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 అనుమతులపై వారు చర్చించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలపైనా నేతలు సమీక్షించినట్లు సమాచారం. ఇటీవల కిషన్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైలుకు ఐఆర్ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. రైల్వేమంత్రితో భేటీ ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ క్రమంలో తాజా సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

(మొదటిపేజీ తరువాయి)

# అప్రమత్తంగా ఉండాలి

మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పబ్లిక్ గ్రీవెన్స్ సిస్టమ్ (పీజీఆర్ఎస్) కింద వచ్చే అర్జీలను సానుభూతితో పరిశీలించాలన్నారు. "సమస్య పరిష్కారం కోసం తమ దగ్గరకు వచ్చే పౌరులతో అధికారులు, ఉద్యోగులు మర్యాదగా ప్రవర్తించాలి. వారి స్థానంలో మనమే ఉంటే ఎలా ఆలోచిస్తామో అలా ఆలోచించి సేవలు అందించాలి. ఇది పరిపాలనపై ప్రజల్లో సానుకూల దృక్పథాన్ని పెంచుతుంది" అని ఆయన హితవు పలికారు. ఉద్యోగుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తామని, పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని తేల్చిచెప్పారు. క్షేత్రస్థాయి పర్యటనల ద్వారానే వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమవుతుందని, మంత్రులు, అధికారులు, ఉద్యోగులు దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సాంకేతికత అందుబాటులోకి వచ్చాక ఫైళ్ల క్లియరెన్స్ సులభమైందని, అయితే వినూత్న ఆలోచనలు లేకపోతే వ్యవస్థలు నిస్సారంగా మారతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆయనకే క్లారిటీ లేదు

అన్నట్టు పవన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జనసేన నేత సామినేని ఉదయభాను మాత్రం బాధితుడి ఇంటికి వెళ్లి పవన్ పంపిస్తేనే వచ్చామంటున్నారని, అసలు పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే క్లారిటీ లేదన్నారు. ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే 'సిట్' నాటకాలు ఆపి, సీబీఐ లేదా ఎన్ఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేత తాతిశెట్టిస్వామంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై అంబటి తీవ్రంగా స్పందించారు. "రాజ్యాంగబద్ధమైన డిప్యూటీ సీఎం పదవిలో ఉండి మాట్లాడే భాషేనా ఇది? మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా? పవన్ గారూ.. మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరు" అని స్పష్టం చేశారు. అలాగే 'నేను హోంమంత్రిని లేకపోవడం మీ అదృష్టం' అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి అనిత సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని... అందుకే పవన్‌కే హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్‌ను కూడా చట్టప్రకారమే శిక్షించారని అంబటి గుర్తు చేశారు. ఒకవైపు సాయిక్రిష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూనే.. మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడైన సీబీ నాగరాజును అరెస్ట్ చేయవద్దని వెనక ఉండి ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని దుయ్యబట్టారు.

## అమెరికాకు షాకిచ్చిన చైనా

బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించనున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైడూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు. అయితే, నెల తిరక్కుండానే బీజింగ్ కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం. దీంతో బీజింగ్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది.

## ఇరాన్ ఆస్తులు విడిపిస్తాం

పేర్కొన్నారు. తాము చేసుకున్న ప్రాథమిక ఒప్పందానికి ఇరాన్ కట్టుబడి ఉందో లేదో ధ్రువీకరించడానికి ఐక్యరాజ్యసమితి అణు తనిఖీ అధికారులు ఇరాన్‌ను సందర్శిస్తారని వాన్స్ తెలిపారు. లెబనాన్ విషయంలో సరైన సమన్వయం ఉండేలా ఇరాన్, ఇజ్రాయెల్ నేతలతో తమ అధికారులు చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. హర్మూజ్ తెరిచే ఉందని.. జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయన్నారు. పాక్ మధ్యవర్తిత్వంతో ఇరుదేశాలు అవగాహన ఒప్పందంలో ముందడుగు వేశాయని ఇరాన్ అధికారులు వెల్లడించారు. పాక్ నేతలు లేకపోతే ఒప్పందం ముందుకు సాగడం కష్టతరంగా మారేదని.. మళ్లీ ఘర్షణలు తలెత్తేవని పేర్కొన్నారు. రాబోయే 60 రోజుల్లో ఒక సమగ్ర ఒప్పందానికి ఎలా చేరుకోవాలనే దాని చర్చలు కొనసాగుతున్నాయన్నారు. చర్చల ద్వారానే దౌత్యపరమైన సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

## దువ్వాడ శ్రీనివాస్‌ను విచారిస్తున్న పోలీసులు

తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు అనుమతి లేదంటూ దువ్వాడ అనుచరులను పీఎస్ బయటే అడ్డుకున్నారు. తమను లోపలికి పంపించాలంటూ దువ్వాడ అనుచరులు పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి, తోపులాటకు దిగారు. అయినప్పటికీ పోలీసులు వెనక్కి తగ్గలేదు. దువ్వాడ శ్రీనివాస్‌తో పాటు దివ్వెల మాధురి, వారి అడ్వొకేట్‌ను మాత్రమే పోలీస్ స్టేషన్ లోపలికి అనుమతించారు. మిగిలిన వారందరినీ బయటే నిలిపివేశారు. ప్రస్తుతం పోలీసులు దువ్వాడ శ్రీనివాస్‌ను విచారిస్తున్నారు.

## బసవతారకం ఆసుపత్రి ఓ భరోసా

అనుప్రియ వివరించారు.

**తల్లి ఆశయాలను నిలిపిన అరుదైన కుమారుడు బాలకృష్ణ: పెమ్మసాని**

క్యాన్సర్ అంటే గుర్తొచ్చేది బసవతారకం ఆసుపత్రి అని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. "100 పడకలతో ప్రారంభమైన ఈ ఆసుపత్రి నేడు 650 పడకల ఆస్పత్రిగా ఎదిగింది. పేదలకు ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ కింద సేవలు అందిస్తున్నారు. కార్పొరేట్‌తో పోలిస్తే దాదాపు 40 శాతం తక్కువ ఖర్చుతో వైద్యసేవలు అందుతున్నాయి. ఆస్తులకు వారసులు ఎందరో ఉంటారు కానీ.. ఆశయాలకు వారసులు కొందరే. తల్లి ఆశయాలను నిలిపిన అరుదైన కుమారుడు బాలకృష్ణ. ఇది ప్రేమకు నిదర్శనమైన పవిత్ర క్షేత్రం. ఎన్టీఆర్ ప్రేమ సాక్షిగా బసవతారకం ఆసుపత్రి చరిత్రలో నిలిచిపోతుంది" అని పెమ్మసాని అన్నారు.

**తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యసేవలు: దామోదర రాజనర్సింహ**

తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. రోగులకు నాణ్యమైన వైద్యసేవలను తక్కువ ఖర్చుతో బసవతారకం ఆసుపత్రి అందిస్తోందని చెప్పారు. "తెలంగాణలో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించడంపై ప్రజలకు అవగాహన పెంచాల్సి ఉంది. రాష్ట్రంలో క్యాన్సర్ రిజిస్ట్రీ మెయింటెన్ చేస్తున్నాం. దీనిని నోటిఫైడ్ వ్యాధిగా గుర్తించాం. ఆరోగ్య ఖర్చులు ప్రజలకు భారం కాకూడదు. క్యాన్సర్ చికిత్సలకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి" అని చెప్పారు.

## వర్చువల్‌గా కోర్టుకు హాజరైన అల్లు అర్జున్

న్యాయమూర్తి ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం కేసు విచారణను న్యాయమూర్తి జులై 6కి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు ఏ11గా చేర్చారు. ఏ1 నుంచి ఏ10 వరకు సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని నిందితులుగా పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే 23 మంది నిందితులపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 డిసెంబర్ 4న పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా.. కుమారుడు శ్రీతేజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

## క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు

ఆలోచన వచ్చింది. 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించాం. బాధతో ఆసుపత్రికి వచ్చే వారు నవ్వుతూ తిరిగి వెళ్లాలి అనేదే మా ఉద్దేశం. భారత్‌లోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రం అప్పట్లో ప్రారంభించాం. ప్రభుత్వాలు మాకు ఎంతగానో సహకరించాయి. ఎన్నో సంస్థలు, ఎందరో దాతలు ఈ ప్రయాణంలో మాకు అండగా నిలిచారు. ఏ ఒక్క రోగి కూడా డబ్బు లేక క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు. 25 ఏళ్ల క్రితం చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాం.. భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తాం. హైదరాబాద్‌లో సేవలు మరింత విస్తరిస్తాం" అని బాలకృష్ణ అన్నారు.

## రైతులకు ఎరువుల కొరత ఉండదు

ఎరువులు విక్రయించే ధోరణిని వెంటనే నిలిపివేయాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులను మాత్రమే అందించాలని, అనవసరమైన ఉత్పత్తులను బలవంతంగా విక్రయించడం సహించబోమని హెచ్చరించారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, సంబంధిత కంపెనీలపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎంఆర్పీ ధర కంటే ఎక్కువ ధరలకు యూరియా విక్రయించడం చట్టవిరుద్ధమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఎరువుల డీలర్లు ఎంఆర్పీ ధరకే విక్రయాలు జరపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ మంజీర్ జిలానీ, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నకిలీ క్యాస్టింగ్ కాల్స్

పత్రాలు లేదా డబ్బులు ఎవరికీ ఇవ్వొద్దు. సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటనలను కేవలం మా సోషల్ మీడియా ఖాతాల ద్వారానే వెల్లడిస్తాం" అని నిర్మాణ సంస్థ తమ ప్రకటనలో పేర్కొంది. కాగా, ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ సోమవారం నుంచే ప్రారంభమైంది. గత వారం ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ ముఖ్య అతిథిగా హాజరై తొలి క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, జాతీయ అవార్డు గ్రహీత జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. అనిల్ రావిపూడికి వెంకటేశ్ తో ఇది ఐదో సినిమా కాగా, 'పటాస్' తర్వాత కల్యాణ్ రామ్‌తో రెండో చిత్రం. దగ్గుబాటి, నందమూరి హీరోల కలయికలో వస్తున్న ఈ సినిమాను పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

## నారా భువనేశ్వరి బర్త్‌డే వేడుకలు

తెలిపారు. ఆమె మాట్లాడుతూ, "నా పుట్టినరోజును ఈ పిల్లల మధ్య జరుపుకోవడం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది. తలసేమియా బాధితుల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత రక్తమార్పిడి, అవసరమైన మందులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నాం. దేశంలో ఎక్కడున్నా సరే బాధితులకు అండగా నిలుస్తాం," అని భరోసా ఇచ్చారు. తలసేమియా బాధితుల కోసం నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ఇప్పటికే అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. వ్యాధిపై అవగాహన కల్పించేందుకు గతంలో విశాఖ, హైదరాబాద్ నగరాల్లో 'తలసేమియా రన్', విజయవాడలో 'యుఫోరియా మ్యూజికల్ నైట్' వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ వ్యాధిగ్రస్తులకు నెలకు రెండుసార్లు రక్తమార్పిడి అవసరం కాగా, వారికి ఉచితంగా సేవలు అందిస్తూ వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈవో కె. రాజేంద్రకుమార్ (రిటైర్డ్ ఐపీఎస్), సీవోవో అడుసుపల్లి గోపి, హెరిటేజ్ హోల్‌టైమ్ డైరెక్టర్ డా. ఎం. సాంబశివరావు, ట్రస్ట్ మరియు హెరిటేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వినిపించడానికి వీలవుతుంది

మారుతున్నారా అని వ్యాఖ్యాత అడిగిన ప్రశ్నకు లోకేశ్ చమత్కరిస్తూ, "మా ముఖ్యమంత్రి గురించి తెలిసిన వారికి అర్థమవుతుంది, ఆయన మాకు ఎలాంటి క్రెడిట్ వదిలిపెట్టరు. ఐటీ ఆయనే, ఏఐ ఆయనే, క్వాంటం కూడా ఆయనే. ఆయన చూపిన మార్గంలో పనులు పూర్తి చేయడమే నా కర్తవ్యం. చంద్రబాబు ఒక బ్రాండ్. ఆ బ్రాండ్ వల్లే గూగుల్ వంటి సంస్థల తలుపులు మాకు తెరుచుకున్నాయి. ఏడాదిలోపు డేటా సెంటర్‌ను దేశానికి అంకితం చేస్తాం" అని తెలిపారు. 'చంద్రబాబు నాయుడు 4.0' పాలన మునుపటి మూడు టర్మ్‌ల కంటే భిన్నంగా ఉంటుందని, 2024 బృందం అత్యద్భుతంగా పనిచేసిందని సీఎం చేత అనిపించుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

**అభివృద్ధి, వనరుల సమతుల్యత**

డేటా సెంటర్లకు అవసరమైన నీరు, విద్యుత్ వల్ల స్థానిక అవసరాలకు ఇబ్బంది కలుగుతుందా అన్న ప్రశ్నకు బదులిస్తూ, "ప్రతి ఏటా గోదావరి నుంచి 3 వేల టీఎంసీల నీరు సముద్రంలో వృథాగా కలుస్తోంది. డేటా సెంటర్లకు కావాల్సింది కేవలం 1.5 టీఎంసీలు మాత్రమే. పోలవరం పూర్తయ్యాక ఈ నీటిని వాడుకుంటాం. ఇక విద్యుత్ విషయానికొస్తే, రాష్ట్రంలో సౌర, పవన విద్యుత్ పుష్కలంగా ఉంది. 'వన్ గ్రిడ్' విధానం ద్వారా సరఫరా చేస్తాం" అని వివరించారు.

**రియల్-టైమ్ గవర్నెన్స్**

రియల్-టైమ్ గవర్నెన్స్ అనేది మార్కెటింగ్ పదం కాదని, దాని ద్వారానే పాలనలో పారదర్శకత సాధ్యమని లోకేశ్ అన్నారు. "గత ఐదేళ్లలో పర్యవేక్షణ లోపించి రాష్ట్రంలో అక్షరాస్యత పడిపోయింది. కానీ ఇప్పుడు రియల్-టైమ్ డేటా ద్వారా ఏ పాఠశాలలో ఏ విద్యార్థి వెనుకబడ్డాడో అమరావతిలో కూర్చొని నేను తెలుసుకోగలను. ఈ పర్యవేక్షణ వల్లే ఈ ఏడాది 85,000 మంది విద్యార్థులు ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చారు" అని ఉదహరించారు.

**రాజకీయ ప్రవేశంపై ఆసక్తికర వ్యాఖ్యలు**

రాజకీయాల్లోకి ఎందుకు వచ్చారని ఆర్నాబ్ అడగ్గా, లోకేశ్ ఒక ఆసక్తికరమైన సంఘటనను పంచుకున్నారు. "2004లో ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన ఏడాది తర్వాత, మా నాన్నగారితో ఒక పెళ్లికి వెళ్లాను. అక్కడ ఉన్న 5,000 మంది ఆయన రాగానే లేచి నిలబడి గౌరవం ఇచ్చారు. పదవిలో లేకపోయినా ప్రజలు ఇచ్చే ఆ గౌరవాన్ని చూశాక, రాజకీయాల్లోనే అంతటి గౌరవం దక్కుతుందని అర్థమైంది. అదే నన్ను రాజకీయాల వైపు నడిపించింది" అని లోకేశ్ తన రాజకీయ ప్రవేశం వెనుక ఉన్న స్ఫూర్తిని వివరించారు. ఈ సంభాషణ ముగింపులో ఆర్నాబ్ గోస్వామి, లోకేశ్‌ను దేశం గమనిస్తున్న యువ నాయకుడిగా ప్రశంసించారు.

## దేవుడి సొమ్ము దేవుడికే.. సనాతన ధర్మ రక్షణే లక్ష్యం

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి... శాఖాపరమైన రెండేళ్ల సుపరిపాలన ప్రగతి, కోట్ల విలువైన ఆలయ భూముల సంరక్షణ, ఉద్యోగాల భర్తీ, మరియు 2027 ప్రతిష్ఠాత్మక గోదావరి పుష్కరాల రోడ్ మ్యాప్‌తో కూడిన సమగ్ర నివేదికను విడుదల చేశారు. తన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో దేవాలయాల సంక్షేమానికి ఏ రాజకీయ పార్టీ కూడా ప్రత్యేకంగా ఎన్నికల ప్రణాళికను రూపొందించిన దాఖలాలు తాను చూడలేదని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి గుర్తుచేశారు. కానీ నేటి కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలోనే దేవాదాయ శాఖకు ప్రత్యేక స్థానం కల్పించి, 11 ధార్మిక హామీలను ఇచ్చిందని, అందులో 10 హామీలను జీవోలతో సహా వంద శాతం అమలు చేసి చెప్పిన మాట నెరవేర్చుకున్నామని ఆయన ప్రకటించారు.

**2027 జూన్ 26 నుండి గోదావరి పుష్కరాలు**

రాబోయే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, పవిత్రంగా నిర్వహించడానికి దేవాదాయ శాఖ సర్వం సిద్ధం చేస్తోందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. ఆగమ పండితులు, టీటీడీ వేద పండితులు దేవాదాయ శాఖ పెద్దలందరూ కలిసి 2027 జూన్ 26వ తారీఖున ప్రారంభమై జూలై 7 వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు నిర్వహించడానికి సుముహూర్తాన్ని నిర్ణయించారని, దీనికి సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేసిందని తెలిపారు. పుష్కరాల పర్యవేక్షణకు 12 మంది మంత్రులతో కూడిన హైపవర్ సబ్ కమిటీని, స్పెషల్ ఆఫీసర్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండ్యన్ ని నియమించామన్నారు. గుండలకమ్మ ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాల్లో రెండు అంచెల్లో పూర్తిస్థాయిలో మొక్కలు నాటి, పర్యావరణహిత హరితహారాన్ని ఏర్పాటు చేశామన్నారు. రాబోయే జూలై, ఆగస్టు మాసాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఏరువాక పౌర్ణమి, యోగా, ధ్యాన కార్యక్రమాలను ఆలయాల్లో ఘనంగా నిర్వహించేందుకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని, ఆలయాలను సామాజిక చైతన్య కేంద్రాలుగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు.

## అంతరిక్షంలో అద్భుతాలు.. చేతిలోని స్మార్ట్‌ఫోన్‌లో విదేశీ బానిసత్వమా?

మనం చంద్రుడి మీదకి, అంగారకుడి దగ్గరికి ఉపగ్రహాలు పంపగలం. కానీ మన చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో దారి చూపించేది అమెరికా జిపిఎస్, తెర మీద నడిచేది గూగుల్ లేదా యాపిల్ సాఫ్ట్‌వేర్. ఈ వాస్తవం వినడానికి చాలా సాధారణంగా అనిపించొచ్చు. కానీ దీనిని లోతుగా విశ్లేషిస్తే ఇది దేశ భద్రత, ఆర్థిక స్వాతంత్ర్యం, డేటా సార్వభౌమత్వంతో ముడిపడిన అత్యంత కీలకమైన ప్రశ్న అని అర్థమవుతుంది. అంతరిక్ష పరిశోధనల్లో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన ఇస్రో ఉన్న మన దేశం, ఇప్పటికీ నావిగేషన్, మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్ విషయంలో విదేశీ టెక్నాలజీపై ఎందుకు ఆధారపడవలసి వస్తోంది? ఈ తీవ్రమైన ప్రశ్నకు సమాధానం వెతికే ప్రయత్నమే ఈ సమగ్ర విశ్లేషణ. ఈ వ్యూహాత్మక ప్రయాణం వెనుక ఒక చేదైన నిజం దాగి ఉంది. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధ సమయంలో శత్రు స్థావరాల కచ్చిత స్థాన సమాచారం కోసం భారత సైన్యం అమెరికా రక్షణ శాఖ నియంత్రణలో ఉన్న ఖూా డేటాను కోరింది. కానీ నాటి అంతర్జాతీయ రాజకీయ సమీకరణాల వల్ల అమెరికా ఆ కీలకమైన సమాచారాన్ని అందించడానికి నిరాకరించింది. అత్యంత క్లిష్టమైన యుద్ధ సమయంలో, మిత్రదేశంగా భావించిన ఒక దేశమే ఇలా వెనుకడుగు వేయడం భారతదేశానికి ఒక పెద్ద కనువిప్పుగా మారింది. విదేశీ టెక్నాలజీపై ఆధారపడటం దేశ రక్షణకే ఎంత ప్రమాదకరమో ఈ అనుభవం నిరూపించింది. ఈ చేదు అనుభవం నుంచే స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేయాలనే పట్టుదల పుట్టింది. అదే నావిక్ దీనిని గతంలో ఐఆర్ఎన్ఎస్ఎస్ అని పిలిచేవారు. 2006లో ఈ ప్రాజెక్టుకు అధికారికంగా ఆమోదం లభించగా, శాస్త్రవేత్తల నిరంతర కృషి ఫలితంగా 2018 నాటికి ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది.నావిక్ అనేది సాంకేతికంగా భారతదేశం సాధించిన అద్భుతమైన విజయం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇది మన దేశ భూభాగంతో పాటు, మన సరిహద్దుల చుట్టూ సుమారు 1,500 కిలోమీటర్ల పరిధిలో 5 నుంచి 10 మీటర్ల కచ్చితత్వంతో అత్యంత ఖచ్చితమైన స్థాన సమాచారాన్ని అందించగలదు. ఇది అమెరికాకు చెందిన జిపిఎస్ వ్యవస్థ సామర్థ్యంతో సమానమైనది. ప్రస్తుతానికి ఇది భారతీయ రైల్వేల్లో (సుమారు 8,700 రైళ్లలో లైవ్ ట్రాకింగ్ కోసం), సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు సరిహద్దు హెచ్చరికలు పంపడానికి, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ముందస్తు సమాచారం అందించడానికి మరియు వాణిజ్య రవాణా వాహనాల తప్పనిసరి ట్రాకింగ్ వంటి రంగాల్లో కీలక పాత్ర పోషిస్తోంది.కానీ ప్రస్తుత తరుణంలో ఈ ప్రతిష్ఠాత్మక వ్యవస్థ ఒక అదృశ్య సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వ్యవస్థను నిలబెట్టడానికి మొత్తం 11 ఉపగ్రహాలను ప్రయోగించినప్పటికీ, సాంకేతిక లోపాల కారణంగా ప్రస్తుతం కేవలం మూడు ఉపగ్రహాలు మాత్రమే పూర్తి స్థాయి స్థాన, నావిగేషన్, కాల నిర్ధారణ సేవలను అందిస్తున్నాయి. వాస్తవానికి ఏదైనా ఒక ప్రాంతం యొక్క ఖచ్చితమైన స్థానాన్ని గుర్తించడానికి కనీసం నాలుగు ఉపగ్రహాల సమాచారం అవసరం కాగా, ప్రస్తుతం ఆ కనీస అవసరం కూడా అందుబాటులో లేకుండా పోయింది. దీనికి ప్రధాన కారణాలు.విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న రుబీడియం అణు గడియారాలు వరుసగా విఫలం కావడం.నెక్స్ట్ జనరేషన్ ఉపగ్రహమైన చీూ-02 ఆశించిన రీతిలో సరైన కక్ష్యలోకి చేరకపోవడం వంటి సాంకేతిక లోపాలు.గ్లోబల్ నావిగేషన్ రంగంలో అంతర్జాతీయంగా చూస్తే, పూర్తి స్థాయి (ప్రపంచవ్యాప్త) కవరేజీ ఉన్న వ్యవస్థలు కేవలం నాలుగే ఉన్నాయి.గ్లోబల్ నావిగేషన్ రంగంలో అంతర్జాతీయంగా చూస్తే, ప్రపంచవ్యాప్త (గ్లోబల్) కవరేజీని అందించగల పూర్తి స్థాయి వ్యవస్థలు కేవలం నాలుగే ఉన్నాయి. అవి సుమారు 31 ఉపగ్రహాలతో సేవలు అందిస్తున్న అమెరికా జిపిఎస్, 24 ఉపగ్రహాలు కలిగిన రష్యా **GLONASS**, 35కి పైగా ఉపగ్రహాలతో దూసుకుపోతున్న చైనా దీవఅణశీబ, మరియు దాదాపు 30 ఉపగ్రహాల సామర్థ్యం ఉన్న యూరోపియన్ యూనియన్‌కు చెందిన **Galileo**. ఈ నాలుగు వ్యవస్థలు మాత్రమే ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా ఖచ్చితమైన స్థాన సమాచారాన్ని అందించగలవు. వీటితో పోలిస్తే భారతదేశానికి చెందిన నవిక్ ఇంకా ప్రాంతీయ స్థాయిలోనే ఉంది. చైనా వంటి దేశాలు తమ సొంత గ్లోబల్ వ్యవస్థను నిర్మించుకుని దేశీయ మొబైల్స్‌లో తప్పనిసరి చేయగా, భారత్ మాత్రం ఇప్పటికీ విదేశీ వ్యవస్థలపైనే ఎక్కువగా ఆధారపడుతూ, సొంత సాంకేతికతను సార్వత్రికం చేసే సవాళ్లను ఎదుర్కొంటోంది. వీటితో పోలిస్తే మన **NavIC** కేవలం ఒక ప్రాంతీయ వ్యవస్థ మాత్రమే. దీనికి ప్రపంచవ్యాప్త కవరేజీ లేదు, ఉపగ్రహాల సంఖ్య కూడా పరిమితం. చైనా తన సొంత బైడౌ వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే కాకుండా, తన దేశంలో తయారయ్యే ప్రతి స్మార్ట్‌ఫోన్‌లో దానిని డిఫాల్ట్‌గా అమర్చేలా కఠినమైన నిబంధనలు తెచ్చింది.

మన దేశంలో మాత్రం స్మార్ట్‌ఫోన్లలో **NavIC**ని తప్పనిసరి చేయాలా వద్దా అనే చర్చల దశలోనే కాలం గడిచిపోతోంది. గతంలో విధించిన గడువులు పదేపదే వాయిదా పడుతూ వస్తున్నాయి. యాపిల్, శాంసంగ్, షావోమీ వంటి అంతర్జాతీయ మొబైల్ తయారీ సంస్థలు, అదనపు చిప్‌సెట్ మరియు హార్డ్‌వేర్ ఖర్చులను తాము భరించలేమని, ఇది వినియోగదారులపై భారం అవుతుందని ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెచ్చాయి. యాపిల్ సంస్థ తన సరికొత్త ఐఫోన్ మోడళ్లలో కొన్నింటికి **NavIC** మద్దతును ప్రకటించడం ఒక సానుకూల పరిణామమే అయినప్పటికీ, ఇది ఇంకా బడ్జెట్ శ్రేణి ఫోన్లలో సార్వత్రికం కాలేదు.నావిగేషన్ వ్యవస్థ కంటే మరింత సంక్లిష్టమైన సమస్య మన మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్ రంగంలో కనిపిస్తోంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌గా ఉన్న భారతదేశానికి, నేటికీ తనకంటూ ఒక స్వతంత్ర మొబైల్ ూూ లేదు. గూగుల్‌కు చెందిన ఆండ్రాయిడ్, యాపిల్‌కు చెందిన ఱూూ అనే రెండు విదేశీ వ్యవస్థలే దేశంలోని కోట్లాది మంది ప్రజల డిజిటల్ జీవితాలను శాసిస్తున్నాయి.ఈ గుత్తాధిపత్యాన్ని అడ్డుకోవాలనే లక్ష్యంతో ఐఐటీ మద్రాస్ మద్దతుతో జీుఅసఖశీజూం అనే స్టార్టప్ సంస్థ "**BharOS**" అనే స్వదేశీ ఆపరేటింగ్ సిస్టమ్‌ను ఆవిష్కరించింది. ముందస్తుగా ఇన్‌స్టాల్ చేసిన థర్డ్-పార్టీ యాప్‌లు లేకుండా, కేవలం వినియోగదారుని గోప్యత, భద్రతకు మాత్రమే ప్రాధాన్యమిచ్చేలా దీనిని రూపొందించారు. ఈ ఆలోచన వినడానికి చాలా బాగున్నప్పటికీ, వాస్తవ రూపంలో ఇది ఆండ్రాయిడ్ ఓపెన్ సోర్స్ ప్రాజెక్ట్ పునాదిపై నిర్మించిన ఒక ఫోర్క్ మాత్రమే. అంటే దీని మూల నమూనా ఇప్పటికీ గూగుల్ సాంకేతికత పైనే ఆధారపడి ఉంది.పైగా ఇది సాధారణ వినియోగదారులకు అందుబాటులో లేదు. ఇది కేవలం ప్రభుత్వ రక్షణ రంగాలు, అత్యంత సున్నితమైన సమాచారాన్ని నిర్వహించే ప్రభుత్వ సంస్థల అవసరాల కోసమే పరిమితమైంది. ఓపెన్ మార్కెట్లో లభించే కోట్లాది సాధారణ స్మార్ట్‌ఫోన్లలో ఇది వాడుకలోకి వచ్చే అవకాశాలు ప్రస్తుతానికి చాలా తక్కువ. గతంలో ఇండస్ ఓఎస్ వంటి భారతీయ ఆండ్రాయిడ్ ఆధారిత వ్యవస్థలు ప్రయత్నాలు చేసినప్పటికీ, అవి ఆర్థిక కారణాల వల్ల పెద్ద ఫైనాన్షియల్ టెక్నాలజీ సంస్థల చేతుల్లోకి వెళ్లి తమ స్వతంత్ర ఉనికిని కోల్పోయాయి.ఈ వెనుకబాటుతనానికి సాంకేతిక లోపాలు మాత్రమే కారణం కాదు, దీని వెనుక అనేక సామాజిక, ఆర్థిక, విధానపరమైన కారణాలు ఉన్నాయి.విధాన అమలులో స్థిరత్వం లేకపోవడం చీుఱజ×జ వాడకాన్ని ఫోన్లలో తప్పనిసరి చేస్తామని ప్రభుత్వ వర్గాలు పదేపదే ప్రకటించినప్పటికీ, దానిని కఠినంగా అమలు చేయడంలో వెనుకాడాయి. అంతర్జాతీయ మొబైల్ తయారీ సంస్థల మార్కెట్ ఒత్తిళ్లకు తలొగ్గి గడువులను పొడిగించడం ఒక బలహీనతగా మారింది.దీర్ఘకాలిక పెట్టుబడుల కొరత, మన దేశంలో కొత్త అంతరిక్ష ప్రయోగాలకు, రాకెట్ల ప్రయోగానికి ఇచ్చే ప్రాధాన్యతను, ఇప్పటికే ఉన్న వ్యవస్థల నిరంతర నిర్వహణకు మరియు ప్రత్యామ్నాయ ఉపగ్రహాల తయారీకి ఇవ్వడం లేదు. ఫలితంగా పాత ఉపగ్రహాలు విఫలమైనప్పుడు, వాటి స్థానాన్ని భర్తీ చేసే కొత్త ఉపగ్రహాలు సకాలంలో సిద్ధంగా లేకుండా పోయాయి.చిప్, హార్డ్‌వేర్ తయారీలో స్వావలంబన లేమి, **NavIC** అయినా, **BharOS** అయినా విజయవంతంగా పనిచేయాలంటే మనకు స్వంత సెమీకండక్టర్లు, ప్రాసెసర్ చిప్‌లు అవసరం. భారతదేశంలో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమ ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. క్వాల్‌కామ్, మీడియాటెక్ వంటి విదేశీ సంస్థలు తమ చిప్‌లలో **NavIC**కి మద్దతు ఇస్తున్నప్పటికీ, ఆ చిప్‌ల సరఫరా మరియు ధరల నియంత్రణ పూర్తిగా వారి చేతుల్లోనే ఉంటుంది. భారతదేశంలో 15 నుంచి 20 వేల లోపు ధర గల బడ్జెట్ ఫోన్లే ఎక్కువగా అమ్ముడవుతాయి. నావిగేషన్ కోసం అదనంగా డ్యూయల్-బ్యాండ్ చిప్‌సెట్లను వాడితే ఫోన్ల ధరలు పెరుగుతాయని, ఇది తమ అమ్మకాలను దెబ్బతీస్తుందని తయారీ సంస్థలు వాదిస్తున్నాయి.నెట్‌వర్క్ ఎఫెక్ట్ సవాలు ,ఆండ్రాయిడ్, ఐఓఎస్ చుట్టూ కోట్లాది యాప్‌లు, డెవలపర్ల వ్యవస్థ మరియు వినియోగదారుల అలవాట్లు గట్టిగా పాతుకుపోయాయి. గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్ లేని ఒక కొత్త ఓఎస్ ని అంగీకరించడానికి వినియోగదారులు సుముఖంగా లేరు. ఈ పర్యావరణ వ్యవస్థను సవాలు చేయడం అనేది కేవలం సాంకేతిక సమస్య కాదు, ఇది భారీ ఆర్థిక, సామాజిక సవాలు.ఇది కేవలం ఒక సాంకేతిక గర్వానికి సంబంధించిన చిన్న విషయం కాదు. దీని వెనుక దేశ భద్రత దాగి ఉంది. కోట్లాది మంది భారతీయుల వ్యక్తిగత సమాచారం, వారి ప్రయాణ వివరాలు మరియు రోజువారీ డిజిటల్ లావాదేవీలు అన్నీ విదేశీ సంస్థల సర్వర్ల ద్వారానే ప్రవహిస్తున్నాయి. భవిష్యత్తులో ఏదైనా అంతర్జాతీయ ఉద్రిక్తతలు లేదా యుద్ధాలు సంభవించినప్పుడు, సదరు విదేశీ సంస్థలు తమ సేవలను నిలిపివేస్తే మన రక్షణ వ్యవస్థ, రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉంది. ప్రతి యాప్ డౌన్‌లోడ్‌పై, ప్రతి డిజిటల్ లావాదేవీపై గూగుల్, యాపిల్ సంస్థలు వసూలు చేసే కమీషన్లు, రాయల్టీల రూపంలో దేశ సంపద నిరంతరం విదేశాలకు తరలిపోతోంది. సాంకేతిక స్వావలంబన లేని దేశం, అంతర్జాతీయ వేదికలపై తన వ్యూహాత్మక బేరసారాల శక్తిని క్రమంగా కోల్పోతుంది.అయితే ఈ పరిస్థితిని చూసి మనం పూర్తిగా నిరాశ చెందాల్సిన అవసరం లేదు. నూతన సాంకేతికతను సున్నా నుంచి నిర్మించగల అద్భుతమైన ప్రతిభ మన శాస్త్రవేత్తలకు ఉంది. మనకు ఇప్పుడు అత్యంత అవసరమైంది దృఢమైన రాజకీయ సంకల్పం, నిరంతర నిధుల కేటాయింపు మరియు కార్పొరేట్ ఒత్తిళ్లకు లొంగకుండా స్వదేశీ సాంకేతికతను ప్రోత్సహించే కఠినమైన విధానాలు.సెమీకండక్టర్ల తయారీలో "మేక్ ఇన్ ఇండియా" ప్రాజెక్టులను మరింత వేగవంతం చేయాలి. దేశీయ విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ సాంకేతిక సంస్థల భాగస్వామ్యంతో సరికొత్త ప్రత్యామ్నాయ మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను మొదటి నుంచి నిర్మించాలి. దానిని కేవలం ప్రభుత్వ వాడకానికే పరిమితం చేయకుండా సామాన్య ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకురావాలి. ఇస్రో చేపట్టబోయే రాబోయే ఎన్వీఎస్ శ్రేణి ఉపగ్రహాల ప్రయోగాల ద్వారా **NavIC** మళ్లీ పూర్వ వైభవాన్ని అందుకొనే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.మనం చంద్రుడి దక్షిణ ధృవంపై కాలు మోపగలిగాం, సూర్యుడి రహస్యాలను వెలికితీయడానికి ఆదిత్య-ూ1ను పంపగలిగాం. అంతరిక్షంలో అంతటి ఘనవిజయాలు సాధించిన దేశానికి, ఒక మొబైల్ సాఫ్ట్‌వేర్ లేదా నావిగేషన్ యాప్‌ను సృష్టించడం అసాధ్యమైన విషయమేమీ కాదు. ఇది కేవలం మన ప్రాధాన్యతలలో, నిబద్ధతలో ఉన్న లోపం మాత్రమే. చీుఱజ×జ ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్షోభాన్ని ఒక హెచ్చరికగా భావించి, లోపాలను సరిదిద్దుకుంటే రాబోయే దశాబ్దంలో భారతదేశం నిజమైన డిజిటల్ స్వాతంత్ర్యాన్ని సాధించగలదు. లేనిపక్షంలో, అంతరిక్షంలో మనం ఎంత ఎత్తుకు ఎదిగినా, మన జేబులోని స్మార్ట్‌ఫోన్ మాత్రం ఎప్పటికీ విదేశీయుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడవలసి వస్తుంది.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# ఎడిటర్ వాయిస్

## నెల్లిమర్ల గల్లంతు.. భోగాపురం ఫిక్స్?

అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ విభజన అన్నది ఈ టెర్మ్ లోనే జరుగుతుందని ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం ఉన్న రూపుతో ఇదే షేపులో ఏ ఒక్క అసెంబ్లీ నియోజకవర్గం ఉండదని అంటున్నారు. ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు ఇంకా మూడేళ్ళ సమయం ఉంది కాబట్టి కచ్చితంగా ప్రస్తుతం ఉన్న 175 సీట్లు భారీగా పెరుగుతాయని కూటమిలో చర్చ సాగుతోంది. అదే సమయంలో అనేక అసెంబ్లీ నియోజకవర్గాల రూపు రేఖలు మారిపోతాయని అంటున్నారు. దాంతో పాటు కొత్త పేర్తో కొత్తగా మారుతాయని కూడా చెబుతున్నారు.

నెల్లిమర్ల మీద చర్చ : ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లాలో ఉన్న నెల్లిమర్ల నియోజకవర్గం మీద ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ఈ సీటు గల్లంతు అవుతుందని అంటున్నారు. నెల్లిమర్ల 2009లో ఏర్పాటు అయింది. అందులో అత్యధిక ప్రాంతాలు పాత భోగాపురం నుంచి తీసుకున్నారు. మరికొన్ని వేరే నియోజకవర్గం నుంచి కలిపారు. అలా ఇప్పటికి నాలుగు ఎన్నికలను నెల్లిమర్ల చూసింది. 2009లో కాంగ్రెస్ గెలిస్తే 2014లో టీడీపీ, 2019లో వైసీపీ 2024లో జనసేన ఇక్కడ నుంచి గెలిచాయి. అయితే 2029 నాటికి నెల్లిమర్ల ఉండదని గట్టిగానే వినిపిస్తోంది.

భోగాపురంగానే : నెల్లిమర్లను తిరిగి భోగాపురంగానే మారుస్తారు అని అంటున్నారు. 2004 వరకూ ఉన్న భోగాపురం అసెంబ్లీలా అయితే ఉండదని కొన్ని కొత్తవి చేరుతాయి, మరి కొన్ని వేరేగా మారుతాయని అంటున్నారు. ఈ విధంగా మార్పులు చేసి భోగాపురం అసెంబ్లీ సీటుని 2029 నాటికి రెడీ చేస్తారు అని అంటున్నారు. ఇక భోగాపురం అంటే ఇపుడు ఎంతో మోజు ఉన్న సీటుగా అవుతుందని చెబుతున్నారు. ఎందుకంటే అక్కడ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు వచ్చింది. దానిని చుట్టూ ఆనుకుని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. అంతే కాదు రిలయెన్స్ వారి డేటా సెంటర్ లక్షల కోట్లతో ఇదే నియోజకవర్గంలో వస్తోంది. దాంతో రేపటి రోజున ఈ సీటు మరో జూబ్లీ హిల్స్ మాదిరిగా మారుతుందని అంటున్నారు.

పోటీకి రెడీనా : ఇక భోగాపురం సీటు అయితే పోటీ చేసేందుకు కూటమిలోని పాటీలు పోటీ పడడం ఖాయమంగా కనిపిస్తోంది. నెల్లిమర్ల జనసేన సిట్టింగ్ సీటు కాబట్టి ఒకవేళ భోగాపురంగా మారిగా కోరుతామని అంటున్నారు. టీడీపీ అయితే మొదటి నుంచి భోగాపురం సీటులో తమకు పట్టు ఉందని అనేక ఎన్నికలు గెలిచామని గుర్తు చేస్తున్నారు. పైగా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు రావడంతో ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యేకు ఎంతో విలువ గౌరవం ఉంటుందని రియల్ ఎస్టేట్ బిజినెస్ కూడా ఊపందుకుంటుందని లెక్కలు వేస్తున్నారు. మరో వైపు వైసీపీ నేతలు కూడా భోగాపురం సీటు మీద కన్ను వేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు వైసీపీ ఇంచార్జిగా ఉన్నారు. అయితే ఆయనతో పాటు మరింత మంది పోటీకి రెడీ అవుతారని ఫ్యాన్ పార్టీలో వినిపిస్తున్న మాటగా ఉంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## లారీ-ఆటో ఢీ.. ముగ్గురి మృతి..



**శావల్యాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం కామేపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ – ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన 10 మంది నాదెండ్ల మండలం సంకురాత్రిపాడులో జరిగే దశదిన కర్మకు హాజరయ్యేందుకు ఆటోలో బయల్దేరారు. కామేపల్లి రైల్వే అండర్‌పాస్ సమీపానికి వచ్చేసరికి.. గ్రానైట్‌తో వస్తున్న లారీ మలుపు తిరుగుతుండగా రెండూ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఏడుకొండలు (60), రమణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన మరో ఏడుగురిని సమీపంలోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుబ్బాయమ్మ (70) ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టెకీ రాధా గాయత్రి కేసులో కీలక పరిణామం.. విచారణాధికారి మార్పు



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరాఖండ్‌లోని మసూరీలో అనుమానాస్పదరీతిలో మృతిచెందిన టెకీ రాధా గాయత్రి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణాధికారిని అక్కడి డీజీపీ దీపమ్‌సేథ్ మార్పు చేశారు. మసూరీ ఎస్‌హెచ్‌వో దేవేంద్ర చౌహాన్ ప్రవర్తనపై మృతురాలి తండ్రి సుధాకర్ డీజీపీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఎస్‌హెచ్‌వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణ నుంచి తప్పించారు. అనంతరం ఆ బాధ్యతను సంపూర్ణానంద్ గైరోలాకు అప్పగించారు. అల్లుడు శ్రీచరణ్‌పై అనుమానాలతో సుధాకర్ మసూరీ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో శ్రీచరణ్‌పై హత్య కేసు నమోదైంది.

## విషాదం.. ఒకే ఇంట్లో నలుగురు ఆత్మహత్య

**నల్గొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్గొండలో విషాదం చోటుచేసుకుంది. ఓ ఇంట్లో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పట్టణంలోని సాగర్ రోడ్డు తెలంగాణ కాలనీలో ఈ ఘటన జరిగింది. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. నాలుగు రోజుల క్రితమే వారు చనిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. మృతుల్లో ఇద్దరిని భార్యాభర్తలు ఎండీ సుల్తాన్, హసీనాగా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. పట్టణంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగుల వ్యాపారం చేస్తుండగా.. హసీనా ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## విద్యుదాఘాతంతో భార్యాభర్తలు మృతి

**బోధన్, విశ్వం వాయిస్ న్యూస్ :** నిజామాబాద్ జల్లా బోధన్ మండలం ఉట్‌పల్లిలో విషాదం చోటుచేసుకొంది. దంపతులు జ్యోతి, సంజీవ్‌లు ఉతికిన దుస్తులు ఆరేస్తుండగా.. విద్యుత్తు తీగలు తగలడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వారి మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

## తవుడు బస్తాల మాటున గంజాయి రవాణా

### 1,125 కిలోల స్వాధీనం.. ముగ్గురు నిందితుల పట్టివేత



**ముంచంగిపుట్టు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి తవుడు బస్తాల మాటున తరలిస్తున్న గంజాయిని, ముగ్గురు నిందితులను నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులు పట్టుకున్నారు. ఎన్‌సీబీ ఇంటెలిజెన్స్ అధికారి, సీఐ కిరణ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాలోని చిత్రకొండ సమీపంలో జాన్‌బై ప్రాంతం నుంచి వ్యాన్‌లో తవుడు బస్తాల కింద గంజాయిని రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టులో ఎన్‌సీబీ పోలీసులు ఆదివారం మాటువేసి వారిని పట్టుకున్నారు. వాహనంలో ఉన్న 1,125 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ముంచంగిపుట్టు మండలం పనస గ్రామానికి చెందిన వంతాల గోపాల్, కిల్లో అనంతరామ్‌తో పాటు ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా గోవిందపల్లికి చెందిన పురుషోత్తమ్ కొర్రాలను అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని జాన్‌బై నుంచి ముంచంగిపుట్టు మీదుగా జైపూర్ తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. ముంచంగిపుట్టులో నివాసం ఉంటున్న కార్తీక్‌కు కొంత గంజాయిని చేరవేసి, మరికొంత జైపూర్‌లో ఉన్న కుమార్ వద్దకు తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. జైపూర్‌లోని కుమార్ పరారయ్యాడని సీఐ కిరణ్‌బాబు తెలిపారు.

### తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఉడుమువారి పల్లి వద్ద

## ఘోర రోడ్డు ప్రమాదం

**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతి నుంచి కడపకు వస్తున్న కడప తిరుపతి సూపర్ లగ్జరీ బస్సును ఢీ కొట్టిన లారీ. ప్రమాదంలో రాజంపేటకు చెందిన 9 నెలల పునీత్ సాయి అక్కడికక్కడే మృతి. తీవ్రంగా గాయపడిన శ్రీకాళహస్తి కి చెందిన యశ్విత (16) కడప రిమ్స్ కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి. బస్సులో ప్రయాణిస్తున్న 16 మందికి కాళ్లు చేతులు తెగిపడి నెత్తురోడిన రోడ్డు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను 108 ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు.

## ఒకే కుటుంబంలో నలుగురు బలవన్మరణం

**చిత్తూరు గ్రామీణం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిత్తూరు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన దిగుమసపల్లె పంచాయతీ బంగారెడ్డిల్లిలో జరిగింది. దామోదరం(30) అనే వ్యక్తి.. తన భార్య నిర్మల(25), కుమారుడు రాజేష్, కుమార్తె శ్రీవిద్యకు విషమిచ్చి, అనంతరం తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కొన్ని రోజులుగా సీఎంసీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. భార్య ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడం, ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండటంతో దామోదరం ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న బీఎన్ఆర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దామోదర్.. సూసైడ్ నోట్‌లో బ్యాంకు ఏటీఎం కార్డు, ఫోన్‌పే పిన్ నెంబర్ రాసిపెట్టాడు. అంత్యక్రియలకు తన ఖాతా నుంచే డబ్బులు వాడుకోవాలని లేఖలో పేర్కొన్నాడు.

### విద్యుత్తు సిబ్బంది నిర్లక్ష్యం..

## విద్యుదాఘాతంతో బాలుడి దుర్మరణం



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** అప్పటివరకు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడికి అంతలోనే నూరేళ్లు నిండాయి. భూగర్భ విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేసిన సిబ్బంది.. స్తంభం వద్ద తెగిన వైర్లను నిర్లక్ష్యంగా వదిలేయడంతో.. అవి ఆ బాలుడికి తగలడంతో తీవ్ర విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు వదిలాడు. విశాఖలోని కొమ్మాది సమీప సాయిరాం కాలనీలో జరిగిన ఈ ఘటనపై సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాలివీ.. విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలం ఉప్పర నాయుడువలస గ్రామానికి చెందిన కురిటి నారాయణరావు, చిన్నమ్మడు దంపతులు పదేళ్ల క్రితం నగరానికి వలస వచ్చారు. సాయిరాం కాలనీలోని ఓ అపార్టుమెంట్లో కాపలాదారుగా ఉంటున్నారు. వీరి కుమారుడు కురిటి అఖిల్ (5) కాలనీకి చెందిన మరో ఇద్దరు పిల్లలతో కలిసి ఆదివారం ఉదయం అపార్టుమెంట్ ముందు రోడ్డుపై ఆటలాడుకుంటున్నాడు. అపార్టుమెంట్ పక్కన భూగర్భ విద్యుత్తు పనులు చేశారు. అక్కడి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరలో ఉన్న విద్యుత్తు స్తంభం వద్ద ఎర్త్ వైర్లు తెగినా.. సిబ్బంది గమనించలేదు. బాలుడు ఆడుకుంటున్న బంతి అక్కడ పడగా.. దాని కోసం వెళ్లిన అఖిల్‌కు అక్కడ ఎర్త్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రమాద ప్రదేశాన్ని ఈపీడీసీఎల్ అధికారులు పరిశీలించారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

### అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి, కుమారుడికి

## సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అండ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవతా దృక్పథంతో ప్రజలకు అండగా నిలుస్తున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ మరోసారి తన సేవా తత్వాన్ని చాటుకుంది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి, కుమారుడికి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం ఆర్థిక సహాయం అందించారు. రామచంద్రపురం మండలం నరసాపురపుపేట గ్రామానికి చెందిన రెడ్డి వరలక్ష్మి బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతుండగా ఆమె కుమారుడు సాయి కృష్ణ కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం కొనసాగించలేని పరిస్థితిలో ఉన్న వారు సహాయం కోసం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. వారి పరిస్థితిని తెలుసుకున్న వాసంశెట్టి సత్యం వెంటనే స్పందించి మందుల ఖర్చుల నిమిత్తం రూ.5,000 నగదు సహాయంతో పాటు బియ్యం అందజేశారు. అంతేకాకుండా వారికి అవసరమైన మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే ఫౌండేషన్ లక్ష్యమని పేదలు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో ఎల్లప్పుడూ తమ సహాయం అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం తెలిపారు. విజ్ఞప్తి చేసిన వెంటనే స్పందించి ఆర్థిక చేయూత అందించిన వాసంశెట్టి సత్యంకు వరలక్ష్మి, సాయి కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తున్న ఫౌండేషన్ సేవలను స్థానికులు అభినందించారు.

## కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం డివిజన్ పరిధిలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ సాగిస్తున్న ఫీజుల దోపిడీని తక్షణమే అరికట్టాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ (పి.డి.ఎస్.యు), విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో సోమవారం రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ మాట్లాడుతూ.. ట్యూషన్ ఫీజులతో పాటు పుస్తకాలు, యూనిఫారాలు, రవాణా, హాస్టల్, ప్రత్యేక కోచింగ్ తదితర పేర్లతో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులు, తల్లిదండ్రుల నడ్డి విరుస్తూ మోపుతున్న అదనపు ఆర్థిక భారాన్ని తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్ విద్యా సంస్థల (ప్రవేశాల నియంత్రణ, కాపిటేషన్ ఫీజు నిషేధ) చట్టం-1983 ప్రకారం కాపిటేషన్ ఫీజులు, డొనేషన్లు వసూలు చేయడం నేరమని అయినప్పటికీ విద్యాసంస్థలు నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయని మండిపడ్డారు. ఫీజుల నియంత్రణ, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 53, 54 ఉత్తర్వులను పలు విద్యాసంస్థలు తుంగలో తొక్కుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ-2009) లోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కేటాయించి ఉచిత విద్య అందించాల్సి ఉన్నా, అమలులో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోందన్నారు. ఆర్టీఈ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు పెండింగ్ ఉన్న ఫీజులను తక్షణమే విడుదల చేయాలని, అనధికారికంగా వసూలు చేస్తున్న అన్ని రకాల అదనపు ఫీజులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణలో పూర్తిగా విఫలమైన జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) విద్యార్థుల తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని పట్టుబట్టారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా యంత్రాంగం ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యామాఫియా ఆటకట్టించాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారుల సమస్యలను సానుకూలంగా విన్న ఆర్డీవో తగిన చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వెంటపల్లి, చింత రాజారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు శివ, రవి, ఉదయ్, నాగరాజు, పార్థు తదితరులు పాల్గొన్నారు.

## కాలువల రక్షణ గోడల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సాగునీరు, తాగునీరు సజావుగా సరఫరా అయ్యేలా కాలువల వెంబడి చేపట్టిన రక్షణ గోడల (రిటైనింగ్ వాల్స్) నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ జలవనరుల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జలవనరుల శాఖ, వ్యవసాయ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, జాతీయ రహదారుల శాఖ ఇంజనీర్లతో ముక్కామల నుంచి నడిపూడి వరకు చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ముక్కామల నుంచి నడిపూడి వరకు పంట కాలువ వెంబడి, మోసళ్ళపల్లి, పాలగుమ్మి, నడిపూడి గ్రామాల పరిధిలో మూడు చోట్ల సుమారు 470 మీటర్ల పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ ఈఈ ఏ.వి.ఎస్. రాజన్, జాతీయ రహదారుల శాఖ ఏఈ వెంకటరమణ, డీఈలు, జిల్లా వ్యవసాయ అధికారి ఎం.వెంకటరామారావు, సంబంధిత గుత్తేదారులు, అధికారులు పాల్గొన్నారు.

### అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి

## కూటమి ప్రభుత్వం ప్రత్యేక కృషి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పిల్లల ఆరోగ్యం, పోషకాహారం, విద్యాభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రామచంద్రపురం, కె. గంగవరం మండలాల్లోని 78 అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్లు, స్టీల్ పాత్రలను సోమవారం వాసంశెట్టి సత్యం, ప్రాజెక్టు సిడిపిఓ వరహాలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం, విద్య అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు చేపడుతోందని చెప్పారు. ఆధునిక వంట సామగ్రి అందుబాటులోకి రావడం ద్వారా ఆహార తయారీ మరింత సులభతరంగా, పరిశుభ్రంగా జరుగుతుందని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మహిళా, శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల, చిన్నారులకు పోషకాహారం, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. గ్రామీణ స్థాయిలో తల్లి, శిశు సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తల సేవలను కొనియాడారు. భవిష్యత్తులో అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఆధునిక వంట సామగ్రి పంపిణీ చేయడం పట్ల అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్లు పార్వతి, మాణిక్యాంబ, నాగమణి, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్కారు మందులు చెత్తలో పాతర..!














**ప్రజారోగ్యం కోసం ఇచ్చిన మందులు చెత్తకుప్పల్లోకి.. - పంచాయతీ నిర్లక్ష్యంతో విషవాయువుల భయం.. - దళితవాడల్లో ఆందోళన..**

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయనే ఆరోపణలు రాయవరం మండలంలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రజలకు చేరాల్సిన ప్రభుత్వ మందులు మట్టిపాలవుతున్న దృశ్యాలు ఒకవైపు ఆందోళన కలిగిస్తుంటే.. మరోవైపు వాటిని చెత్తతో పాటు తగలబెట్టే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరం లోని ప్రభుత్వ ఆసుపత్రి భవనం శిధిలావస్థకు చేరడంతో, ఆసుపత్రి భవనం గత సంవత్సరం లో మరొక ప్రాంతానికి మార్చారు. కాగా భవనం మార్పు సమయంలో తమకు అవసరమైన వస్తువులు , ఫర్నిచర్ ను తరలించి మందులు, ఇంజక్షన్లు, వైద్య సామగ్రి ని సక్రమంగా భద్రపరచకుండా పాత ఆసుపత్రి భవనం బయటే విడిచి పెట్టడం, అని ఇప్పటికీ అక్కడే ఉండడం వలన సిబ్బంది తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు తాజాగా తుల్యభాగ నది పరిసరాల్లో నవంబర్ 2026 వరకూ గడువు ఉన్న కాల్షియం, విటమిన్ డి3 టాబ్లెట్లు పెద్ద ఎత్తున చెత్తలో మట్టి పాలవుతూ కనిపించడం చూస్తే వైద్యారోగ్య అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు రేకెత్తిస్తూ, పలు ప్రశ్నలకు దారితీస్తుండగా ప్రజలకు అందాల్సిన మందులు చెత్తలోకి ఎలా చేరాయని, వాటి నిల్వలు, పంపిణీపై పర్యవేక్షణ ఏమైందనే ప్రశ్నలను పలువురు లేవనెత్తుతున్నారు. ప్రజాధనంతో కొనుగోలు చేసిన మందులను నిర్లక్ష్యంగా బాధ్యత లేకుండా విడిచిపెట్టడం, ఊరి చివర చెత్తలో పడేయడం బాధ్యతారాహిత్యమని పలువురు మండిపడుతున్నారు. దీనికి తోడు గ్రామంలోని సేకరించిన చెత్తనంతటిని, పంచాయతీ సిబ్బంది తుల్యభాగా నది తీరానికి చేర్చి నొప్పి పెట్టడం, చెత్తను దహనం చేయడం మరింత ఆందోళన కలిగించే అంశమని, పంచాయతీ సిబ్బంది ప్రతిరోజూ చెత్తను తగలబెట్టే సమయంలో ఈ మందులు కూడా మంటల్లో కలుస్తే విషవాయువులు ప్రబలి, దగ్గర్లోని పలు కాలనీలలోని ప్రజలు విషవాయువులు పీల్చి అనారోగ్యం పాలయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఆరోపణలు ఉన్నాయి. మందులు, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వైద్య వ్యర్థాలు కాల్చడం వల్ల వెలువడే పొగలో ప్రమాదకరమైన విష వాయువులు ఉంటాయని.. అవి సమీపంలోని దళితవాడలను కమ్మేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఇప్పటికే పలుచోట్ల ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులో లేవని ఫిర్యాదులు వస్తుండగా.. మరోవైపు అందుబాటులో ఉన్న మందులను చెత్తలో కలిపి కాల్చడమేంటని ప్రశ్నిస్తున్నారు. దీని వెనుక ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది నిర్లక్ష్యం తోనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థలోనే నిర్లక్ష్యం చోటు చేసుకోవడం దురదృష్టకరమని.. వెంటనే ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రిలో

## సీనియర్ వైద్యులను అందుబాటులో ఉంచాలి

**ఎలక్ట్రికల్ కార్మికులు గుర్తింపు కార్డు పొందాలి – మందుల కొరతను తగ్గించాలి**
**రేట్లు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలి : బొజ్జా రామకృష్ణ డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు.బొజ్జ రామకృష్ణ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ నుండి ప్రతి ఒక్క ఎలక్ట్రికల్ సోదరులకు యూనియన్ గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలి లేని యెడల జూన్ 4వ తేదీ నుండి పనులు పూర్తిగా నిలిపి వేయబడును. ఈ ఎలక్ట్రికల్ వృత్తిని ఎంచుకొని ఈ వైర్లు దొంగతనానికి పాల్పడుతున్నారు. ఎలక్ట్రిషన్ పేరు చెప్పి కొంతమంది దొంగతనాలకు పాల్పడుతున్నారు మా యూనియన్ కి రిపోర్ట్ వచ్చిన పిదప గతంలో పోలీసు వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగినది, నిస్వార్ధంగా పనిచేసే వారికి మనుగడ లేదు కాబట్టి ఈ యొక్క గుర్తింపు కార్డు ప్రతి ఒక్క వినియోగదారుడు కూడా కచ్చితంగా గుర్తింపు కార్డు పొందాలి అన్నారు. ఎలక్ట్రికల్ సోదరులు ప్రతి ఒక్కరు కూడా రేట్లు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలి. 100 కోట్లు ఖర్చుపెట్టి ఈఎస్ఐ ఆసుపత్రి కనీసం సీనియర్ డాక్టర్లు లేక కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు, మందులు కొరత కూడా ఎక్కువగా ఉన్నది. దీనిని దృష్టిలో పెట్టుకొని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈఎస్ఐ హాస్పిటల్‌పై తక్షణం స్పందించి కార్మికులకు మేలు చేయాలని బొజ్జ రామకృష్ణ డిమాండ్ చేశారు.

## మండపేట మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వం ఆమోదం : కమీషనర్ టీవీ రంగారావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వ ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ & అర్బన్ డెవలప్మెంట్ శాఖ జీఓ జారీ చేసింది. ఆంధ్ర ప్రదేశ్ టౌన్ ప్లానింగ్ చట్టం 1920 లోని సెక్షన్ 14(3) ప్రకారం మండపేట మున్సిపాలిటీ పరిధి జి ఐ ఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ ను ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ ప్లానింగ్ మండపేట కమీషనర్ టీవీ రంగారావుకు సమాచారం ఇచ్చారు. మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించిన భూ వినియోగాలు జోనింగ్ నిబంధనలు అభివృద్ధి నియంత్రణలు ఆంధ్ర ప్రదేశ్ పట్టణ ప్రణాళిక నియమ నిబంధనలు ఆంధ్రప్రదేశ్ టౌన్ ప్లానింగ్ చట్టం, 1920 సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అమలులో ఉంటాయని కమీషనర్ టీవీ రంగారావు తెలిపారు. మండపేట మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, స్థల యజమానులు, డెవలపర్లు, నిర్మాణ అనుమతులు కోరేవారు సంబంధిత శాఖల అధికారులు మాస్టర్ ప్లాన్‌లోని భూ వినియోగ ప్రతిపాదనలు, జోనింగ్ నిబంధనలు అభివృద్ధి నియమావళిని తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. వాటి ప్రకారమే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ మేరకు సోమవారం మాస్టర్ ప్లాన్ ప్రతులు మండపేట మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగంలో ప్రజల పరిశీలన కొరకు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిఈ కింతాడ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారి రమ్యశ్రీ, సిబ్బంది పాఠంశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## 2029లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది : కాంగ్రెస్ నాయకులు




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రం ప్రెస్ క్లబ్ నందు కాంగ్రెస్ పార్టీ నాయకులు పిర్ల గణేష్,జి సత్యనారాయణ, గరగ శ్రీధర్ బాబు, యాళ్ళ మాసరయ్య, గుండుబోగుల శ్రీనివాస్ (రంగా శ్రీను), మోర్త అబ్బులు, ఆళ్ళపాడి గోవిందు, యాళ్ళ సత్యనారాయణ, కోడి నాగేష్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం జరిగింది.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయిందని దుయ్యబట్టారు.దేశం లో ఉత్తమ పాలన అందించిన దేశ మాజీ ప్రధాని అయిన నెహ్రూతో బిజెపి నాయకుడు నేటి ప్రధాని నరేంద్ర మోడీని పోల్చడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. దేశంలో ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం పేద ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపాధి పనులు అందించకుండా పేద ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ,ప్రైవేటు విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ లేకపోవడంతో పేద విద్యార్థులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడుతూ ఉన్నత విద్యను అభ్యసించలేకపో తున్నారని అన్నారు. 12 సంవత్సరాల మోదీ పాలనలో నిత్యవసర వస్తువులు మరింతగా పెరిగాయని,పెట్రోల్,డీజిల్,గ్యాస్ వంటి వాటిపై అధిక పన్నులను విధిస్తూ పేద ప్రజలను పీల్చుకు తింటున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని బిజెపి పార్టీ చేసిందని బిజెపి పార్టీ నాయకులు డబ్బా కొట్టుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయుటలో వైఫల్యం చెందిం దని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పూర్తిస్థాయిలో విద్యార్థులకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయలేకపోయిందని కరెంట్ బిల్లు సాకుతో విద్యార్థుల తల్లిదండ్రులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని అన్నారు. నేటి కూటమి పాలనను ప్రజలు గమనిస్తూనే ఉన్నారని కేంద్రంలో, అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నారని మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందని అన్నారు. నూతన పెన్షన్లను ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పాటు కాలయాపన చేసిందని ఇప్పటికైనా నూతన పెన్షన్లలను అందించక పోతే ప్రజల తరపున నిరసన దీక్షలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం

**రూ. 8.50 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని ప్రతి డివిజన్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక లింగంపేట 5వ వీధిలో రూ.8,50,000 వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) డివిజన్ ఇంచార్జ్ యాళ్ల ప్రదీప్ తదితరులతో కలిసి శంఖుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానికులతో కలిసి పనుల ప్రదేశాన్ని పరిశీలించి నిర్మాణ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లింగంపేట ప్రాంతంలో పర్యటిస్తూ స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి అవసరమైన చోట అభివృద్ధి పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామన్నారు. లింగంపేట ప్రాంతంలో చాలాకాలంగా ఉన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో ఈ సీసీ డ్రైనేజీ నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాల మెరుగుదల కోసం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి పనులు చేపడుతున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపే విధంగా పనిచేస్తున్నామని అన్నారు. “మన వార్డులో – మన ఆదిరెడ్డి” కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువవుతూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నామని, ప్రజల సహకారంతో రాజమహేంద్రవరాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ డ్రైనేజీ నిర్మాణం పూర్తయిన తర్వాత వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు స్థానికులకు మెరుగైన పారిశుద్ధ్య వాతావరణం ఏర్పడుతుందన్నారు. నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొర్రెల రమణి, చాపల నాగమణి, కూటమి నాయకులు, డివిజన్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాకినాడ టౌన్ బ్యాంక్ డైరెక్టర్‌గా

## పుల్లెపు వీరన్న కాపు



**పలువురు అభినందనలు**

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ సొసైటీ మాజీ అధ్యక్షులు పుల్లెపు వీరన్న కాపు( వీరబాబు) కాకినాడ టౌన్ బ్యాంక్ డైరెక్టర్ గా నియమితులైనట్లు కాకినాడ టౌన్ బ్యాంక్ అధ్యక్షులు మాజీ పార్లమెంట్, శాసన సభ్యులు చిట్టూరి రవీంద్ర అధికారికంగా ఆదేశాలు జారీ చేసినట్లు పుల్లెపు తెలిపారు. చిట్టూరి శాసనసభ్యులు పనిచేస్తున్నాయాంలో పుల్లెపు కోరుకొండ సొసైటీ అధ్యక్షులుగా రైతులకు విశిష్ట సేవలు అందించి పలువురు మనలను పొందారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి చిట్టూరి మన్ననలు పొందారు. దీంతో కాకినాడ టౌన్ బ్యాంక్ అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర, వీరన్న కాపు సేవలను గుర్తించి కాకినాడ టౌన్ బ్యాంక్ డైరెక్ట్ గా నియమింప చేశారు. ఈ సందర్భంగా పుల్లెపు వీరన్న కాపుకు పార్టీలకతీతంగా పలువురు రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంఘాలు, ఆధ్యాత్మికవేతలు, రైతులు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పుల్లెపు మాట్లాడుతూ టౌన్ బ్యాంక్ అధ్యక్షులు చిట్టూరి రవీంద్రకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా అభినందనలు తెలియజేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

రెవెన్యూ ఉన్నతాధికారుల ఒత్తిడి తాళలేక

## వీఆర్వో ఆత్మహత్యయత్నం

**గతంలోనూ ఇదే సంఘటన – తీరు మార్చుకోని రెవెన్యూ ఉన్నతాధికారులు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రెవెన్యూ ఉన్నతాధికారుల పని ఒత్తిడి తాళలేక కోరుకొండ విఆర్ఓ కొవ్వాడ రామకృష్ణ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. సోమవారం కోరుకొండ విఆర్ఓ రామకృష్ణను తాసిల్దార్ రెవెన్యూకు సంబంధించిన పలు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఒత్తిడి చేశారని, తగిన సమయం ఇవ్వకుండా పని వత్తిడితో సతమవుతూ విఆర్ఓ మానసిక వేదనకులోనే గడ్డి మందు సేవించినట్లు తెలిపారు. దీంతో పరిస్థితి విషమించడంతో హుటాహుటిన కోరుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కోరుకొండ మండలంలో గతంలో తాసిల్దార్ పని ఒత్తిడి కారణంగా వీఆర్వో పురుగుల మందు సేవించిన ప్రాణాపాయం నుంచి బయటపడిన విషయం పాఠకులకు విధేయతమే. ఏది ఏమైనా కోరుకొండ మండలంలో నరసన్న దేవుడి మన్యం భూములు సమస్య వీఆర్వోలకు పెద్ద గుదిబండగా తయారైంది. ప్రస్తుతం వీఆర్వో రెవెన్యూ పనులతో పాటు రీ సర్వే, బిఎల్ఓ, సర్, వంటి పనులు త్వరితగతిని పూర్తి చేయాలని ఒత్తిడి చేయడం, కొద్దిమంది తాసిల్దార్లు ఉన్నత అధికారులు మెప్పుకోసం సమయం ఇవ్వకుండా విఆర్వోలకు తీవ్రంగా పని ఒత్తిడి పెంచుతున్నట్లు విఆర్వోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు కోరుకొండ మండలంలో ఆరుగురు వీఆర్వోల కొరత ఉందని, ఆ పని కూడా మిగిలిన వారికి బదలాయించడంతో వీఆర్వోలు మానసిక ఒత్తిడికి గురవుతున్నామంటున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు ఇదే వరవడి కొనసాగిస్తే, ఉద్యోగాలకు విరామం ప్రకటిస్తామంటున్నారు. చికిత్స పొందుతున్న బాధితుడిని వీఆర్వోల సంఘం నాయకులు పరామర్శించారు.

## ఇందిరా సత్యనగర్ బాధితులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది

**న్యాయం చేయాలని పిజిఆర్ఎస్‌లో కమీషనర్‌కు టీకే విశ్వేశ్వరరెడ్డి వినతి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక సారంగధర మెట్ట నుంచి సువిశేషపురం వరకు ఉన్న ఇందిరా సత్యనగర్ పుంత రోడ్డులో ఆక్రమణల తొలగింపులో బాధితులకు అక్కడే స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మాణం చేయాలని కాంగ్రెస్ రాజమహేంద్రవరం పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి నగర పాలకసంస్థ కమీషనర్ రాహుల్ మీనాకు విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు సోమవారం బాధిత కుటుంబాలతో కలిసి మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగిన పిజిఆరఎస్‌లో కమీషనర్‌కు వినతి పత్రం అందచేసి బాధితుల సమస్యలను వివరించారు. అనంతరం టీకే విశ్వేశ్వర రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుంచి అక్కడే నివాసం ఉంటున్న 110 కుటుంబాలకు తీరని అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేసారు. చాలా మంది నిరుపేదలు అక్కడే పక్కా గృహాలు కట్టుకుని నివాసం ఉంటున్నారని, ఇంటి పన్ను, కరెంటు, కుళాయి కనెక్షన్ కూడా వేసి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కమీషనర్ చాలా సానుకూలంగా స్పందించారని 80 అడుగుల పుంత రోడ్డును సర్వే నిర్వహించి ఇళ్లులేని వారికి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చినట్టు వివరించారు. వారికి ప్రత్యామ్నాయం చూపించే వరకు మిగిలిన ఇళ్లను పడగొట్టబోమని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఇందిరా సత్య నగర్ బాధితులకు అధికారులు న్యాయం చేయకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. వారికి సరైన న్యాయం చేసే వరకు కాంగ్రెస్ పార్టీ తరపున తాను అండగా నిలబడతానని తెలిపారు.

## కొడవలితో కొడుకుపై దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** కుటుంబ కలహాల నేపథ్యంలో చోటుచేసుకున్న దాడి ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. రాయవరం ఎస్సై సురేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరం లోని రాజరాజేశ్వరి కాలనీలో జూన్ 1వ తేదీన రాత్రి సమయంలో కుటుంబంలో వివాదాలు తలెత్తి గంటా శ్రీను(45) తన కుమారుడు గంటా పవన్ కళ్యాణ్‌పై కొడవలితో దాడి చేసిన ఘటన చోటుచేసుకోగా, ఈ ఘటనలో గాయపడిన పవన్ కళ్యాణ్ ఆసుపత్రిలో ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు గంటా శ్రీను సోమవారం అదుపులోకి తీసుకుని అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం నిందితుడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై డి.సురేష్ బాబు తెలిపారు.








### అంగన్వాడీలకు ఇండక్షన్ స్టవ్వులు
## అందజేసిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మరింత ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్వులను పంపిణీ చేశారు. సోమవారం అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న తన క్యాంపు కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు స్వయంగా ఈ స్టవ్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో గ్యాస్ కొరత లేదా పొగ కారణంగా కార్యకర్తలు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు ఆధునిక ఇండక్షన్ స్టవ్వులను అందిస్తున్నట్లు తెలిపారు. వీటి వినియోగంతో వంట ప్రక్రియ సులభతరం కావడంతో పాటు సమయం ఆదా అవుతుందని, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని చెప్పారు. పిల్లల భవిష్యత్తు అంగన్వాడీ కేంద్రాల నుంచే ప్రారంభమవుతుందని, అక్కడ వంటలు త్వరగా, పరిశుభ్రంగా సిద్ధమవడం వల్ల చిన్నారులకు వేడివేడిగా, సకాలంలో పౌష్టికాహారం అందించవచ్చని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శ కేంద్రాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, రాబోయే రోజుల్లో మరిన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఇండక్షన్ స్టవ్వుల వినియోగ విధానం, విద్యుత్ ఆదా చేసే మార్గాలపై అంగన్వాడీ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే చొరవను అంగన్వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్లో ఘనంగా ఫాదర్స్ డే వేడుక



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫాదర్స్ డే సందర్భంగా రావులపాలెం శ్రీ చైతన్య స్కూల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోనసీమ రీజినల్ ఇంచార్జ్ నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల పట్ల గౌరవం కలిగి ఉండి క్రమశిక్షణతో చదువులలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అదే తల్లిదండ్రులకు విద్యార్థులకు వారు ఇచ్చే విలువైన బహుమతి అని తెలియజేశారు. ప్రిన్సిపల్ జగదీష్ సభను ఉద్దేశించి ఫాదర్స్ డే సందర్భంగా తల్లిదండ్రులు గురువు దైవంతో సమానమని తల్లిదండ్రులు వారి జీవితాలను పిల్లల కోసం అనేక త్యాగాలు చేసి కష్టపడి చదువులు చెప్పించి వారి భవిష్యత్తు కోసం దారులు వేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు కలలను నిజం చేసి సమాజానికి మంచి పేరు తీసుకువచ్చే ఉన్నత స్థితిలో ఉండాలని తమ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు సర్టిఫికెట్ల ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు ,తరగతి ఉపాధ్యాయులు పాల్గొనడంతో ఎంతో కోలాహలంగా ,ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డీన్ సతీష్, సి ఇంచార్జ్ మూర్తి , ప్రైమరీ ఇంచార్జ్ కుమారి ప్రీ ప్రైమరీ ఇన్చార్జి లలిత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణలు, అమ్మకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండల కేంద్ర మైన కాట్రేనికోనలోని ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయాల సమీపంలోని ఆర్ అండ్ బి,డ్రైనేజీ, రెవెన్యూ భూములను కొంతమందిఆక్రమించారని కాట్రేనికోనకు చెందిన అయితా బత్తుల పండు బాబు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్ కు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులు పాము ఆక్రమించిన భూములను వేరొకరికి అమ్మకాలు చేశారని ఈ విషయంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయని వీరిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరి కొంతమంది ఆక్రమించిన భూముల్లో బెల్ట్ షాపులు, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, ఈ దుకాణాల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, పుష్కరాల సందర్భంగా కుండలేశ్వరం ఆలయానికి లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఈ ఆక్రమణల తొలగింపు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## ఓటు ప్రజాస్వామ్య హక్కు
### సార్ సర్వేకు సహకరించండి : గుబ్బల మూర్తి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సార్ సర్వేకు అందరూ సహకరించి ఓటు నమోదు చేయించుకోవాలని ఓటు ప్రజాస్వామ్య హక్కు అని కొత్తపేట సీనియర్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ఎన్నుకునే హక్కు ఒక్క ఓటుకు మాత్రమే ఉందని ఆయన తెలియజేశారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సార్ సర్వే కార్యక్రమం కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదేశాలతో వేగవంతంగా జరుగుతోందని ఎప్పటికప్పుడు బూత్ కన్వీనర్లతో పార్టీ ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడి సార్ సర్వే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారనీ గుబ్బల మూర్తి తెలిపారు.కొత్తపేట 136 బూత్ కమిటీ పరిధిలో బూత్ కమిటీ కన్వీనర్ పోలిశెట్టి శ్రీనివాసరావు బిఎల్ఓ అశోక్ టిడిపి నాయకులు గుబ్బల మూర్తి తదితరులు ఇంటింటికి వెళ్లి ఓటర్ లను కలిసి ఓట్లు నమోదు చేశారు.ఓటు యొక్క ఆవశ్యకతను వివరించి 18 సంవత్సరాల నిండిన యువత తప్పనిసరిగా ఓటు నమోదు చేయించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.ఒక్క ఓటు నమోదుకు 15 నుంచి 20 నిమిషాల సమయం పడుతుంది. ఓటు నమోదుకు సమయం పడుతున్నప్పటికీ ప్రభుత్వం చేపట్టిన సార్ సర్వే కార్యక్రమం ఖచ్చితమైన ఓటును నిర్దేశిస్తుంది.ఓటు ఒక్కచోట మాత్రమే ఉంటుంది. వేరేచోట ఉండే అవకాశం ఉండదని గుబ్బల మూర్తి తెలిపారు క్లస్టర్ కంఠం శెట్టి శ్రీనివాసరావు యూనిట్ ఇంచార్జ్ యల్లమెల్లి జగన్మోహన్ గుబ్బల మూర్తి పోలిశెట్టి శ్రీనివాస్ తదితరుల పర్యవేక్షణలో ఓటు నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుచున్నది అన్నారు.

# ప్రజా సమస్యలకు నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలి

**అర్జీలు రీ-ఓపెన్ కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించాలి - నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు**
**ప్రతి సోమవారం జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ - కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్**



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల నుంచి అందే ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ అర్జీలు తిరిగి రీ-ఓపెన్ కాకుండా నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్‌తో పాటు డీఆర్వో వి. సుబ్బారావు, కెఆర్ఆర్సీ ఎస్‌డీసీ అచ్యుత కుమారి పాల్గొని అర్జీదారుల నుంచి సుమారు 250 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన ప్రతి వినతిని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుదారులతో స్వయంగా మాట్లాడి, నిర్దేశిత గడువులోగా సత్వర పరిష్కారం చూపాలన్నారు. రీ-ఓపెన్‌కు ఆస్కారం ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అర్జీదారులు తమ సమస్యల కోసం పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా పూర్తి సంతృప్తి కలిగే విధంగా నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. ఏదైనా సాంకేతిక లేదా చట్టపరమైన కారణాల వల్ల ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, అందుకు గల కారణాలను అర్జీదారులకు అర్థమయ్యే రీతిలో స్పష్టమైన ఎండార్స్‌మెంట్ రూపంలో తెలియజేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా, కాలయాపన చేసినా సంబంధిత అధికారులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. శాఖాధిపతులు స్వయంగా ఈ ఫిర్యాదులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు సుపరిపాలన అందిస్తూ వారి సమస్యలను వేగవంతంగా పరిష్కరించే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ పాల్గొన్నారు.

### పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేసే నైతిక
# అర్హత వైసీపీకి లేదు: కూటమి నాయకులు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేసే నైతిక అర్హత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి లేదని రామచంద్రపురం నియోజకవర్గ కూటమి పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు కాపు సమాజానికి ఇచ్చిన హామీలను విస్మరించి ఇప్పుడు కాపుల పేరుతో సమావేశాలు నిర్వహించడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. రామచంద్రపురం లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి పార్టీ నాయకులు, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, కాపు నాయకులు కంచుమర్తి బాబురావు, అన్యం శ్రీరామ్, కొట్టువాడ హరిబాబు, దేవు వెంకటరాజు, ఆళ్ళ బుజ్జి తదితరులు మాట్లాడారు. కాపు వర్గానికి బీసీ రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ హామీని పూర్తిగా విస్మరించి కాపులను మోసం చేసిందని, కాపు కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి యువత ఆశయాలను దెబ్బతీసిందని ఆరోపించారు. పవన్ కళ్యాణ్‌ను ఒక కులానికి పరిమితం చేసే ప్రయత్నాలు దురుద్దేశపూరితమైనవని, ఆయన రైతు, కార్మికుడు, యువకుడు, మహిళ, మధ్యతరగతి కుటుంబం సహా అన్ని వర్గాలకు ప్రతినిధిగా ఎదిగిన నాయకుడని స్పష్టం చేశారు. వెంకటాయపాలెంలో తోట త్రిమూర్తులు నిర్వహించిన సమావేశం కాపు సంక్షేమం కోసం కాదని కేవలం కొందరు నాయకులు తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నమని కూటమి నేతలు విమర్శించారు. వైఎస్ఆర్ కాపులు అనే పేరుతో కాపు సమాజాన్ని రాజకీయంగా విభజించేందుకు ప్రయత్నించడం హాస్యాస్పదమని కాపులు ఏ పార్టీకి బానిసలు కారని తేల్చిచెప్పారు. దేశ ప్రధానమంత్రి స్వయంగా పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లి పరామర్శించడం ఆయన రాజకీయ స్థాయిని, జాతీయ ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. కులాలను విభజించే రాజకీయాలు జగన్‌కు సాధ్యమైతే కులాలను కలిపే రాజకీయాలు పవన్ కళ్యాణ్‌తోనే సాధ్యమని ఉద్ఘాటించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేస్తూ అభివృద్ధి, సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నారని, సమాజ ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధి కోసమే తాము కూటమికి అండగా నిలిచామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు గొల్లపల్లి కృష్ణ, సలాది నాయుడు, కవల నానాజీ, నారపురెడ్డి బలరాం, అంకం శ్రీను, పేపకాయల నారాయణరావు, నువ్వు ముప్పనపల్లి గణేష్, సలాది రమేష్, కొండేపూడి సత్తిబాబు, ఎలుగుబండ్ల శ్రీను, కొప్పిశెట్టి శ్రీను, పదం మూర్తి, మాగాపు బుజ్జి, మాకినీటి సత్యనారాయణ, ఆకుల నారాయణరావు, ఆకుల సతీష్, సంపత్ సత్యనారాయణ, అల్లం రామకృష్ణ తదితర కాపు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాధితుల సమస్యలకు సత్వర న్యాయమే మా ప్రాధాన్యత : జిల్లా ఎస్పి రాహుల్ మీనా



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పి రాహుల్ మీనా, ఐపీఎస్, జిల్లా అడ్మిన్ ఎస్పి ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్ (ఎన్‌సీ)తో కలిసి స్వయంగా బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పి ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 36 ఫిర్యాదులు నమోదయ్యాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, సివిల్ సంబంధిత సమస్యలు ఉన్నాయి. అందిన ఫిర్యాదులను వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపిస్తూ, క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ నిర్వహించాలని ఎస్పి అధికారులను ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉండాలని, ప్రతి ఫిర్యాదును అత్యంత పారదర్శకంగా, జాప్యం లేకుండా పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఎస్పి బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పి ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్ (ఎన్‌సీ), డీపీఓ సిబ్బంది మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఆంధ్ర ప్రార్థన పండుగ సువార్త మహోత్సవం
### ప్రముఖ సినీ నటుడు సూర్య భగవానుదాస్ దైవ సందేశం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సువార్త దళం – సాధు ఆధ్వర్యంలో "ఆంధ్ర ప్రార్థన పండుగ సువార్త మహోత్సవం" జూన్ 23 మంగళవారం సాయంత్రం 7 గంటల నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం అమలాపురం నల్లవంతెన సమీపంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో జరగనుంది. "యేసుక్రీస్తుని ఎరుగుటయే నిత్యజీవము" అనే పరిశుద్ధ గ్రంథంలోని యోహాను 17:3 వాక్యాన్ని ప్రధాన సందేశంగా తీసుకుని ఈ సువార్త మహాసభలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రార్థనలు, ఆరాధన గీతాలు, దైవ వాక్య బోధనలు, విశ్వాసులకు ఆధ్యాత్మిక ప్రోత్సాహాన్ని అందించే సందేశాలతో కార్యక్రమం కొనసాగనుంది. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు సూర్య భగవానుదాస్ హాజరై ప్రత్యేక దైవ సందేశాన్ని అందించనున్నారు. ఆయన ప్రసంగం ద్వారా విశ్వాసం, ప్రేమ, సేవాభావం, క్రైస్తవ జీవన విధానంపై ఆధ్యాత్మిక బోధనలు అందించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అలాగే ఈ కార్యక్రమానికి రాజకీయ, సామాజిక, వ్యాపార రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొననున్నారు. వారిలో జనసేన నాయకులు, ది చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, జనసేన నాయకుడు నల్ల శ్రీధర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఒంటెద్దు వెంకన్న నాయుడు, రాష్ట్ర హ్యాండీక్రాఫ్ట్స్ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నాయకుడు ఆర్డీఎస్ ప్రసాద్ పాల్గొని సభను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు, దైవజనులు, విశ్వాసులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరవుతారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రార్థనల ద్వారా రాష్ట్ర శ్రేయస్సు, ప్రజల ఆరోగ్యం, కుటుంబాల అభివృద్ధి, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో అమలాపురం పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, క్రైస్తవ సోదర సోదరీమణులు, విశ్వాసులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ ఆంధ్ర ప్రార్థన పండుగ సువార్త మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సువార్త దళం సభ్యులు ఆహ్వానించారు.

### వైఎస్ జగన్‌పై ఎమ్మెల్యే పంతం నానాజీ వ్యాఖ్యలపై
# కాశి రామకృష్ణ ఆగ్రహం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన అనుచిత, అహంకారపూరిత వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కాశి రామకృష్ణ తెలిపారు. రాష్ట్ర ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న ప్రజా నాయకుడైన వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై, నిలకడ లేని రాజకీయాలు చేసే పంతం నానాజీ తన స్థాయిని మరిచి మాట్లాడటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. పంతం నానాజీ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. "పంతం నానాజీ మతిభ్రమించి, మద్యం మత్తులో మాట్లాడినట్లుగా వ్యవహరిస్తున్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే కాకినాడ రూరల్ ప్రజలే తగిన బుద్ధి చెబుతారు. అధికార పక్షం అనే అహంకారంతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే వైఎస్సార్‌సీపీ శ్రేణులు తగిన రీతిలో స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాయి" అని అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలకు దిగితే మాత్రం సహించేది లేదని కాశి రామకృష్ణ స్పష్టం చేశారు.

## రామచంద్రపురంలో నేటి నుంచి "రైతన్న మీకోసం" ఇంటింటి ప్రచారం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం మండలంలో ఈ నెల 22 నుండి 27వ తేదీ వరకు "రైతన్న మీకోసం" ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి టి.వి.ఆర్. మణిదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి, రైతులకు అవగాహన కల్పించి వారి అభివృద్ధికి బాటలు వేయడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రచారంలో భాగంగా సిబ్బంది ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి సారించి రైతులకు అవగాహన కల్పిస్తారని వివరించారు. ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం లోపం, వాతావరణ మార్పులపై ముందస్తు అవగాహన కల్పించి, నీటి సంరక్షణ చర్యలు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను సిద్ధం చేయడం గురించి వివరిస్తామన్నారు. అదేవిధంగా, ఎరువుల ఆన్‌లైన్ పంపిణీ వ్యవస్థ ద్వారా కలిగే ప్రయోజనాలు, పారదర్శకతను వివరిస్తూ.. నేల పరీక్షల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగంతో పెట్టుబడి ఖర్చులు తగ్గించి, అధిక దిగుబడులు సాధించే మార్గాలను తెలియజేస్తామన్నారు. ఈ 'రైతన్న మీకోసం' కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి టి.వి.ఆర్. మణిదీప్ కోరారు.

### మురికి నీటితోనే
## పంటలు పండించాల్సిన దుస్థితి
### నేను సైతం టీం తరుపున రెండు పిర్యాదులు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మన నేను సైతం టీం తరుపున రెండు పిర్యాదులు ఇవ్వడం జరిగింది. పవిత్ర కౌసిక్ నది ఇరువైపులా ఉన్న సుమారు 250 అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించమని ఎన్నో సంవత్సరాల నుండి నేను సైతం టీం తరుపున ఎన్ని పిర్యాదులు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉండడం ఎన్నో అనుమానాలకు దారి తీస్తుంది భవిష్యత్తులో పవిత్ర కౌసిక్ నది ఇరువైపులా అద్భుతంగా పార్కు తయారు చేసి మురిగి నీటి తో పూర్తిగా కూరుకుపోయిన పవిత్ర నదిని నదిలా కాపాడమని మన కొత్తపేట నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో కూడా సెపరేట్‌గా డ్రైనేజీ నిర్మాణం లేకపోవడం వలన భాద్యతలు తెలిసిన పంచాయతీ అధికారులు కూడా డబ్బులు ఊబలంక మరియు లొల్ల గ్రామాల పరిధిలో కొత్తగా వంతెనలు ఏర్పాటు కు అనుమతులు ఇవ్వడం పంట కాలువలలో పేరుకుపోయిన పూడికను కూడా తొలగించకుండా అలాగే వదిలేయడం పంచాయతీ సెక్రటరీ లు డబ్బులు తీసుకుని పంట కాలువల లోకే గ్రామాల్లో ఉండే మురికి నీటి డ్రైనేజీ నీటిని వదిలేయడం వలన అన్నదాతలు అనేక రోగాల భారినపడుతున్నారు సాగు నీరుతో కాకుండా మురికి నీటితోనే పంటలు పండించాల్సిన దుస్థితి ఏర్పడింది అని పిర్యాదులు ఇవ్వడం జరిగింది కొత్తపేట నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఉండే ప్రజలు ముఖ్యంగా అన్నదాత లు కూడా నేను సైతం అంటూ ముందుకు రావాలని కోరుకుంటూ కుడిపూడి విష్ణు మూర్తి నేను సైతం టీమ్.

## తారు ప్లాంట్ ఏర్పాటును నిలిపివేయాలి



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన ఆలమూరు గ్రామ సమీపంలో ప్రతిపాదిత తారు మిక్సర్ ప్లాంట్ ఏర్పాటును వెంటనే నిలిపివేయాలని గ్రామ రైతులు, స్థానికులు సోమవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తపేట ఆర్డీవో జి.వి.వి. సత్యనారాయణ, ఆలమూరు తహసీల్దార్ కుశరాజు, ఎంపీడీవో రాజులకు, వినతిపత్రాలు అందజేశారు. మసీదు రోడ్డుకు ఆనుకుని, గ్రామానికి అత్యంత సమీపంలో ఉన్న వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి తారు మిక్సర్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి అతి దగ్గరలో ఇటువంటి పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల వాయు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ప్లాంట్ నుంచి వెలువడే పొగ, ధూళి, రసాయన పదార్థాల కారణంగా ఆస్తమా, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అలాగే భారీ వాహనాల రాకపోకలు పెరగడం వల్ల గ్రామ పరిధిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన ఆలమూరులో ఇటువంటి పరిశ్రమ ఏర్పాటు చేయడం వల్ల పంటలపై, భూసారంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల చొప్పెల్ల గ్రామంలో కూడా తారు మిక్సర్ ప్లాంట్ ఏర్పాటుపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పచ్చని గ్రామాలు, నివాస ప్రాంతాలకు సమీపంగా కాలుష్యకారక పరిశ్రమలు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజారోగ్యం, రైతుల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రతిపాదిత తారు మిక్సర్ ప్లాంట్ ఏర్పాటును నిలిపివేయాలని వారు కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ
## వాసంశెట్టి సత్యంకు వినతిపత్రం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం ఏపీ మున్సిపల్ వర్కర్స్ (పర్మినెంట్ అండ్ కాంట్రాక్ట్) యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రామచంద్రపురం శాసనసభ్యుడు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతిపత్రం అందజేసేందుకు యూనియన్ నాయకులు సోమవారం వెళ్లారు. మంత్రి అందుబాటులో లేకపోవడంతో, మంత్రి తండ్రి, టీడీపీ సీనియర్ నాయకుడు, సత్యం ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యంకు మున్సిపల్ కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మున్సిపల్ కార్మికులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను వాసంశెట్టి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా మున్సిపాలిటీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని కోరారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతినెలా ఒకటవ తేదీనే ఎలాంటి జాప్యం లేకుండా జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యలను సానుకూలంగా విన్న వాసంశెట్టి సత్యం, ఈ విషయాలను వెంటనే మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మున్సిపల్ వర్కర్స్ కార్యదర్శి జి. రాజు, రామచంద్రపురం ఏఐటీయూసీ నాయకుడు వడ్డాది రాజు, రామచంద్రపురం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి. సత్యనారాయణ, ఏ. మాచర్ల రావు, మీసాల గోపి, వి. రవి, వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..





# ప్రజా సమస్యలు నేరుగా పంతం వద్దకు..

## సమస్యలపై తక్షణమే స్పందించిన గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ
## కాలనీలలో కాలినడకన పర్యటించి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ!





**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కరప మండలం నడకుదురు గ్రామం భాస్కర్ వెంచర్ పరిధిలోని ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి కాలనీ వాసులు, కూటమి నాయకుల ద్వారా తెలుసుకున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ గారు తక్షణమే స్పందించి ఈరోజు స్వయంగా అధికారులతో కలిసి ఆ గ్రామానికి వెళ్లి కాలనీలో కాలినడకన పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీ వాసులు ఎదుర్కొంటున్న రోడ్లు, త్రాగునీరు, డ్రైనేజీ మరియు ఇతర మౌలిక వసతుల కొరతను అడిగి తెలుసుకుని అప్పటికప్పుడే సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులకు సమస్యల తక్షణ పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. కాలనీలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం, ప్రజల రక్షణ కోసం వెంటనే సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, భద్రతను మరింత పెంచాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినా ఈ రెండేళ్లల్లో నడకుదురు గ్రామానికి సుమారు 35 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల కోసమే పనిచేస్తుందని, నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా కృషి చేస్తామని కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే గారి తక్షణ స్పందన మరియు చొరవ పట్ల భాస్కర్ వెంచర్ కాలనీ ప్రజలు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు గొల్లపల్లి చంద్ర శేఖర్, బండారు మురళి, ముద్రగడ రమేష్, నల్లె ప్రసన్న కుమార్, ముమ్మిడి పుష్పలత, గ్రామ అధ్యక్షులు భాస్కర్ తమ్మయ్య, చీపురుపల్లి జయంద్రబాబు, అమ్మిరెడ్డి శివ నారాయణ, భవాని శంకర్, సింగంపల్లి నాగేశ్వర రావు, యాసలపు విష్ణు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### పోలీస్ పిజిఆర్ఎస్‌లో
# 49 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ



**కాకినాడ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ మొత్తం 49 ఫిర్యాదులను స్వీకరించారు.వాటిలో భూ తగాదాలు 12 ,కుటుంబ కలహాలు 17,ఇతర విభాగాలకు చెందినవి 20 గా గుర్తించబడ్డాయి.ఈ సందర్భంగా ఎస్పీ “ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే, తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి, తగిన పరిష్కారం చూపాలని, వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్న ఎస్పీ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్య లను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారు.

# జిల్లా కలెక్టర్ పిజిఆర్ఎస్‌కు 321అర్జీలు

## రెవిన్యూ క్లినిక్‌కు 44అర్జీలు : జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను తప్పనిసరిగా గడువులోపు పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులనుసేవ ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, ట్రైనీ కలెక్టర్ ప్రియ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, జీజీహెచ్ పరిపాలన అధికారి ఎన్.శ్రీధర్, స్వర్ణ గ్రామ వార్డు అధికారి జె.వెణుగోపాల్, డీఎల్డీవో వాసుదేవరావు తదితర అధికారులతో కలిసి హాజరై, జిల్లా చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు, దరఖాస్తులను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారాణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై మొత్తం 321అర్జీలు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను సకాలంలో నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినందున అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. వివిధ శాఖలలో నమోదైన అర్జీలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణిత గడువులోపు తగిన పరిష్కారాలు ఇవ్వాలని ఆయన తెలిపారు. అర్జీలు పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. తొలుత జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్.. అన్ని మండలాల తహాశీల్దార్లు ఎంపీడీవోలతో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార పురోగతి, సర్ ఇతర కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

**రెవెన్యూ క్లినిక్‌కు 44 అర్జీలు**

రెవిన్యూశాఖలో సమస్యల పరిష్కారం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతివారం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వివేకానంద హాలుపైన జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, పి.కృష్ణ మూర్తి, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే, భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, జాయింట్ ఎల్పీఎంలు, 22ఏలోని భూములు, సర్వే నెంబర్లు ఇతర రెవెన్యూ అంశాలపై మొత్తం 44 అర్జీలు అందాయని జేసీ అపుర్వ భరత్ తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్.. రెవెన్యూ డివిజన్ అధికారులు, అన్ని మండలాల తహాశీల్దార్లతో రెవెన్యూ క్లినిక్ అర్జీల పరిష్కార పురోగతిపై సమీక్ష నిర్వహించి ఈ అర్జీలను సకాలంలో పూర్తిగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమాలలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహాశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలి

## కాకినాడ కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ నిరసన దీక్ష



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రగతి రథ చక్రం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థఆర్టీసీను ప్రైవేటుపరం చేసే కుట్రలకు కూటమి ప్రభుత్వం ఆలోచనలను నిరసిస్తూ కలెక్టరేట్ కార్యాలయం వద్ద కాకినాడ వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రూరల్ ట్రేడ్ యూనియన్ ప్రెసిడెంట్ సిద్ధాంతపు రవికుమార్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చెక్కా చక్రవర్తి మాట్లాడుతూ ప్రస్తుతం డీజిల్ ధరలు, ఇతర ఖర్చులు భారీగా పెరిగాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టీసీని ప్రైవేటీకరించి ప్రజలపై అదనపు భారం మోపడం తీవ్ర అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ప్రధాన కార్యాలయాల్లో వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం తన పద్ధతిని మార్చుకోకపోతే, రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# తప్పిపోయిన బాలుడు కుటుంబ సభ్యులకు అప్పగింత



**కాకినాడ రూరల్ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** తప్పిపోయిన బాలుడుని గంటల వ్యవధిలోనే తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. కాకినాడ రూరల్ మండలం, పగడాలపేట గ్రామానికి చెందిన బొమ్మిడి లక్ష్మి, బొమ్మిడి రామకృష్ణ తమ 3 సంవత్సరాల వయస్సు గల మనవడు సంగాడి వినయ్ కుమార్ ఏ బబ్లు ఇంటి వద్ద నుండి కనిపించడంలేదని ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నలుగురు ఎస్ఐల ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టి, తప్పిపోయిన బాలుడు సంగాడి వినయ్ కుమార్ ఏ బబ్లును క్షేమంగా గుర్తించి, కాకినాడ సబ్-డివిజినల్ పోలీస్ అధికారి సమక్షంలో అతని అమ్మమ్మ, తాతయ్యలకు సురక్షితంగా అప్పగించారు. ఈసందర్భంగా పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు.

# రైతు బజార్లో దళారులను తొలగించాలని మాకిరెడ్డి ఆమరణ దీక్ష



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న రైతు బజార్లో దళారులు పాగా వేసి వినియోగదారులను దోచుకుంటున్నారని అందువల్ల అక్కడ నిజమైన రైతులను గుర్తించి దళారులను తొలగించాలని డిమాండ్ చేస్తూ 93 బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర్ గణేష్ బాబు సోమవారం ఆమరణ దీక్ష చేపట్టారు. గత కొంతకాలంగా దళారులను అరికట్టాలని రైతు బజార్ ఎస్టేట్ అధికారి, జిల్లా అధికారులను కలిసి ఎన్నోసార్లు వినతి పత్రాల ద్వారా విన్నవించానని భాస్కర్ చెప్పారు. అయినా కాలయాపన చేయడం, దళారుల దందా పెరగడంతో విసుగు చెంది ఆమరణ నిరాహార దీక్షకు తాను పూనుకున్నట్లు మాకిరెడ్డి చెప్పారు. దీక్షకు ముందుగా మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో 1999లో తొలిసారిగా ఈ రైతు బజార్ అప్పటి సీఎం చంద్రబాబు ఆలోచనతో ప్రారంభమైందని ఈ బజారులో కాలువలు ఆక్రమించుకొని వ్యాపారం చేసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. తక్షణమే 80 అడుగుల రోడ్డు నగరపాలక ప్రణాళిక విభాగంలో ఉందని దాన్ని ఏర్పాటు చేసి నిజమైన రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భాస్కర్ దీక్షకు పలువురు బీసీ నాయకులు, వివిధ వ్యాపార వర్గాలకు చెందిన నేతలు అధిక సంఖ్యలో హాజరై మద్దతు ప్రకటించారు.

# వాకాడ ఆర్ఎస్కేలో ఎరువుల పంపిణీ ప్రక్రియను పరిశీలించిన జేసీ అపూర్వ భరత్



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** సోమవారం కరప మండలం, వాకాడ గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో రైతులకు అందుతున్న సేవలపై జేసీ ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ‘ఎన్ఎఫ్ఎస్ఎఫ్’ మొబైల్ అప్లికేషన్ ద్వారా ఎరువుల రిజిస్ట్రేషన్, పంపిణీ జరుగుతున్న తీరును జేసీ నిశితంగా పరిశీలించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో భాగంగా రైతులు ఎరువు కొనుగోలుకు మొబైల్ యాప్ వినియోగంలో రైతులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను స్థానిక మండల వ్యవసాయ అధికారిణిని జేసీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ.. రైతులతో మాట్లాడి సమస్యలను సావధానంగా విన్నారు. ఈ సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం సంబంధిత టెక్నికల్ టీమ్‌తో తక్షణమే మాట్లాడి, ఎటువంటి ఆటంకాలు లేకుండా రైతులకు ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఎరువులు పంపిణికి నూతన విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. ‘ఎన్ఎఫ్ఎస్ఎఫ్’ డిజిటల్ విధానాన్ని ఈ ఖరీఫ్ సీజన్ నుంచి ప్రవేశపెట్టిందని ఆయన తెలిపారు. సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఎరువుల పంపిణీ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఈ యాప్ వినియోగంపై అవగాహన అపోహలు నమ్మకుండా అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రైతులు ఈ యాప్ సులభంగా ఉపయోగించుకునేలా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జేసీ సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కరప తహసీల్దార్ లక్ష్మీ సరస్వతి, వ్యవసాయ అధికారిణి ఐ.సత్య, సొసైటీ చైర్మన్ దూడల నారాయుడు స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

### ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి
# వేగవంతమైన చర్యలు తీసుకోవాలి

## డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కాకినాడ నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం వివిధ విభాగాలకు చెందిన పలు అర్జీలు అందాయి. వాటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 1, ఇంజినీరింగ్ విభాగానికి 7, యూపీఏ విభాగానికి 1, రెవెన్యూ విభాగానికి 3 అర్జీలు వచ్చాయి. ‘డయల్ యువర్ కమిషనర్’ కార్యక్రమం ద్వారా ఫోన్ కాల్స్ ద్వారా నలుగురు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వృధ్వీచరణ్, డీసీపీ కృష్ణారావు, ఉద్యానవన శాఖ ఏడీ శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

## ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమాన్ని బూత్ లెవల్ అధికారులు పకడ్బందీగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా సూచించారు.సోమవారం రాజమండ్రి అర్బన్ నియోజక వర్గం పరిధిలో బత్తినగర్‌లోని 148, 149 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, బీఎల్ఓల పనితీరు, ప్రత్యేక మొబైల్ యాప్ వినియోగాన్ని ఆయన పరిశీలించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి ఎస్ఐఆర్ ప్రక్రియపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా పూరించాలి, ఏయే వివరాలు నమోదు చేయాలనే అంశాలను సులభంగా వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అర్హులైన ప్రతి ఒక్క ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎస్ఐఆర్-2026 కోసం రూపొందించిన ప్రత్యేక యాప్ సమర్థవంతంగా పనిచేస్తోందని, క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రక్రియ కొనసాగుతోందన్నారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలోని 241 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,65,721 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 1,03,532 ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేయగా, 1,899 ఫారాలు డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, డేటా సేకరణ, ధృవీకరణ కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఓటర్ల వివరాల్లో ఉన్న పొరపాట్లను సరిచేయడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఓటర్లు కూడా తమ వివరాలను పరిశీలించి, పూర్తిచేసిన ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బీఎల్ఓలకు సకాలంలో అందజేసి, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనలో సహకరించాలని కమిషనర్ కోరారు.ఈ పర్యటనలో ఆర్ఎంసీ సెక్రటరీ శైలజవల్లి, ఎమ్మార్వో రంజిత్ కుమార్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# కాపర్ వైర్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

## చోరీ సొత్తు స్వాధీనం.. నిందితుడికి రిమాండ్



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలోని ఎలక్ట్రికల్ వైండింగ్ షాపులో ఇటీవల జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు ఆధ్వర్యంలో ఎస్సై సురేష్ బాబు నిందితుడిని అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాయలరం లోని విజయదుర్గ ఎలక్ట్రికల్ వైండింగ్ షాపులో జూన్ 17వ తేదీ రాత్రి తాళాలు పగులగొట్టి 20 కిలోల కాపర్ వైర్‌ను దొంగిలించినట్లు షాపు యజమాని గాజుల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, దీంతో కేసు నమోదు చేసిన ఎస్ఐ డి. సురేష్ బాబు దర్యాప్తు చేపట్టగా దర్యాప్తులో భాగంగా వెదురుపాక సావరం రోడ్డులో గల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు తేలిందని, వెదురుపాక గ్రామానికి చెందిన పైలా రాజరాజేశ్వరరావు (28)ను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 20 కిలోల కాపర్ వైర్‌తో పాటు చోరీకి ఉపయోగించిన టీవీఎస్ విక్టర్ మోటార్ సైకిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, అనంతరం నిందితుడిని అనపర్తి జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించినట్లు మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించి చోరీ సొత్తును రికవరీ చేసిన ఎస్సై డి. సురేష్ బాబు, కానిస్టేబుల్స్ లక్ష్మీనారాయణ, కోటేశ్వరరావు, వెంకటరాజు, సుధాకర్‌లను సీఐ అభినందించారు.

# రాజమహేంద్రవరం- కూనవరం బస్సు సమయం మార్పు

## ఉదయం 9 గంటలకు బదులుగా 8.30 గంటలకు బయలుదేరును : డీపీ టివో వైఎస్ఎన్ మూర్తి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లాలోని విలీన మండలాలైన కూనవరం, వరరామచంద్రపురం, చింతూరు, ఎటపాక మండలాల ప్రయాణికుల సౌకర్యార్థం వయా రంపచోడవరం మీదుగా వెళ్ళే ఏపీఎస్ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో నుంచి ఇటీవల ప్రారంభించిన రాజమహేంద్రవరం -కూనవరం మీదుగా భద్రాచలం బస్సు సర్వీసు బయలుదేరే సమయం ఉదయం 8.30 గంటలకు మార్పు చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి యేలూరి సత్యనారాయణ మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఉదయం 9.00 గంటలకు బయలుదేరుతున్న ఈ బస్సు, ఐటీడీఏ ఉద్యోగులు, వీలీన మండలాల ప్రజలు మరియు స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఇకపై ఉదయం 8.30 గంటలకు రాజమహేంద్రవరం నుంచి బయలుదేరుతుందని ఆయన వెల్లడించారు. ఈ బస్సు సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకుని ఆదరించాలని జిల్లా ప్రజారవాణా అధికారి యేలూరి సత్యనారాయణ మూర్తి కోరారు.

# పీజీఆర్ఎస్ ఫిర్యాదుల సత్వర పరిష్కారం

## ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి : అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) ద్వారా అందిన అర్జీలను నిర్దేశిత గడువులోగా నాణ్యమైన పరిష్కారంతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కార పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అలాగే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల (ఈ ఎఫ్) పంపిణీని మరింత వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఫారాల పంపిణీ పూర్తి చేసి, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి అదనపు కమిషనర్ కె.టి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, హెల్త్ ఆఫీసర్ డా. పృధ్వీచరణ్, టీపీఆర్ఓ శైలజ, ఉద్యానవన శాఖ ఏడీ శ్రీనివాసరావు, సచివాలయం-101 సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

మంగళవారం, 23 జూన్ 2026
www.viswamvoice.com





# రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్కు రాజ్యాంగం అమలు

**ప్రభుత్వ అన్యాయాలు, ప్రజా ప్రతినిధుల అక్రమాల పై మాజీ ఎంపీ భరత్ ధ్వజం - పార్టీ బీసీ నాయకుడి పీతా రామకృష్ణ అరెస్టు రెడ్ బుక్ రాజ్యాంగమే**

**జిల్లా కలెక్టరేట్ పిజిఆర్ఎస్‌లో చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు కల్తీ పాల ఘటనలో బాధిత బాలల చికిత్సను పట్టించుకోని ప్రభుత్వం**

**గామన్ బ్రిడ్జి భద్రతకు ప్రమాద కారిగా ఇసుక దోపిడీ - ముస్లిం షాదీఖానాను అడ్డుకున్న ఈవిఎం ఎమ్మెల్యే**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో మంత్రి లోకేష్ రెడ్ బుక్కు రాజ్యాంగం అమలవుతుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తొక్కుతోందని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తు వేధిస్తున్నారని వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి , మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రభుత్వ వైఫల్యం పై ధ్వజమెత్తారు. ప్రభుత్వ అన్యాయాలపై , అక్రమాలపై, స్థానిక ప్రజా ప్రతినిధుల అక్రమాల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్లో పిజిఆర్ఎస్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎంపీ భరత్ రామ్ జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఆనం తరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నగరంలో జరిగిన కల్తీ పాల ఘటనలో బాల, బాలికలు మెరుగైన, ఆధునిక వైద్య చికిత్సలు అందక మృత్యు ఒడిలోకి జారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘటన జరిగినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సహా ప్రభుత్వ పెద్దలు బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తామని అసెంబ్లీలో ప్రకటించారని, ఈరోజు వరకు సరైన వైద్యం అందించడం లేదని బాలల బాధితుల కుటుంబాలు పిల్లలను రక్షించుకొలేక ఆర్థికంగా సతమాతమవుతున్నాయని, ప్రభుత్వం హామీని నిలబెట్టుకోలేకపోవడం దారుణం అన్నారు. బాలల కుటుంబాలకు ఇప్పటివరకు మూడున్నర లక్ష ల రూపాయలు ఖర్చయిందని ఇంతవరకు ప్రభుత్వం రియంబర్స్మెంట్ కూడా చేయలేదని , వైద్యం చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యాలు కూడా బెదిరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో జిల్లా కలెక్టర్ స్పందించాలన్నారు.

**రెడ్ బుక్ రాజ్యాంగం ప్రకారమే పీతారామకృష్ణ అక్రమ అరెస్టు**

రాష్ట్రంలోనూ, రాజమండ్రిలోను రాజ్యాంగం లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందని, తమ పార్టీలో క్రియాశీలకంగా ఉండే బీసీ నాయకుడు పీతారామకృష్ణ పై అక్రమంగా పి డి చట్టం ప్రయోగించారని భరత్ మండిపడ్డారు. ఇదంతా ఈవీఎం ఎమ్మెల్యే కుట్ర లో భాగమేనని, అతని ఒత్తిడి మేరకు పోలీసులు నియంత్రత్వంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నగర టీడీపీలో 40 వ వార్డు పరిసరాల్లో రెండు గ్రూపులు కొట్టుకున్నాయని, కొట్టిన వారి పెట్టిన కేసును పోలీసులు నమోదు చేశారని దెబ్బలు తిన్న వారిని అరెస్టు చేశారని భరత్ విమర్శించారు. ఇదేంటి అన్యాయమని అడిగినా పీతా రామకృష్ణను గతంలో కొట్టేసిన కేసులను అడ్డం పెట్టుకొని పిడి యాక్ట్ అమలు చేయడం దారుణం అన్నారు. కోర్టుకు వెళ్లి రౌడీ షీట్ పై స్టే ఆర్డర్ తెచ్చుకున్నారనీ అయినప్పటికీ పోలీస్‌లు అరెస్టు చేయడం ఈవీఎం ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించడమే ప్రధాన బాధ్యతని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయించడం ప్రభుత్వ నియంత్రత్వ ధోరణికి నిదర్శనం అన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని ఆన్నారు.

**ప్రజల సహకారస్ఫూర్తిని దెబ్బతీస్తున్న ఇన్నీస్ పేట కోపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ తీరు**

ప్రజల సహకార స్ఫూర్తికి, ప్రజల ఆర్థిక భద్రతకు, అభివృద్ధికి తోడ్పడవలసిన ఇన్నిస్పేట కోపరేటివ్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ కోళ్ల బాబు తీరు ఆర్బిఐ నిబంధనలకు విరుద్ధంగా ఉందని భరత్ విమర్శించారు. కోపరేటివ్ బ్యాంకు 1964 చట్టం నుండి ఏకపక్ష , శాశ్వత ఛైర్మన్ పదవి కి దారి తీసే 1995 మాక్ చట్టం పరిధిలోకి బలవంతంగా ప్రజలను, సభ్యులను ఒప్పించేలాగా కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. ఈ మార్పు ఆర్బిఐ నిబంధనలకు విరుద్ధమని, కోళ్ల బాబు అనే వ్యక్తి ఇప్పటికే గత 20 సంవత్సరాలుగా బ్యాంకును పట్టుకొని వేలాడుతున్నాడని ఇతని చర్యలు వెనుక ఈవీఎం ఎమ్మెల్యే కులాభిమానం ఉందని ఆరోపించారు. ఆర్యపురం బ్యాంకు ను మరొక ఈవీఎం ఎమ్మెల్యే అనుచరుడు పాలిస్తున్నాడని, నగరంలోని కోపరేటివ్ బ్యాంకులను తమ ఆస్తులుగా పంచేసుకున్నారని విమర్శించారు. ఆర్.బి.ఐ నిబంధనల ప్రకారము ఏ సభ్యుడైన, ఏ డైరెక్టర్ అయినా 8 లేదా 10 సంవత్సరాల మించి ఉండకూడదని స్పష్టంగా ఉందని ఈ నిబంధనలను మ్యాక్ చట్టంను అడ్డం పెట్టుకొని కోళ్ల బాబు ముఠా ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. ప్రజలకు చెందిన రూ.140 కోట్ల రూపాయలు డిపాజిట్లు ఉన్నాయని, ఆర్థిక భద్రతకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కోపరేటివ్ అర్బన్ బ్యాంకులు వారి వంశపారంపర ఆస్తుల ఏమిటి ? దీనిపై ప్రజా పోరాటం చేస్తామన్నారు.



**గామన్ బ్రిడ్జి ప్రమాదకరంగా డ్రెజింగ్‌తో ఇసుక దోపిడీ**

బోట్ మెన్ సొసైటీల పేరుతోగా మన్ బ్రిడ్జి వద్ద రాత్రి పగలు తేడా లేకుండా డ్రెజింగ్ బోట్లతో ఈవీఎం ఎమ్మెల్యే అనుచరులు ఇసుక దోపిడీ చేస్తున్నారని భరత్ విమర్శించారు. గామన్ బ్రిడ్జి ప్రమాదంలో పడుతోందని, స్థానిక స్థానిక మత్స్యకారులకు ఉపాధి కోల్పోతున్నారని, స్థానికులకు ఆరోగ్యపరంగా రోగాల బారిన పడుతున్నారని, ఈవిఎం ఎమ్మెల్యే అని ఎందుకు గెలిపించుకున్నామని క్షోభ పడుతున్నారని అన్నారు. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఇసుక దోపిడీ జరుగుతోందని, సామాన్య ప్రజలకు ఇసుక లభ్యం కావడం లేదని విమర్శించారు ఈవీఎం ఎమ్మెల్యే ధన దాహం కు అంతం లేదని, గామన్ బ్రిడ్జి రక్షణ, పర్యావరణ పరిరక్షణ కోరుతూ ఆరోగ్యపరంగా ప్రజల పక్షాన ప్రతిపక్ష పార్టీ బాధ్యతగా ధర్నాలు చేస్తామని, అవసరమైతే నిరాహార దీక్షలు చేస్తామని భరత్ హెచ్చరించారు. ఇసుక దోపిడీకి సంబంధించి సాక్ష్యాధారాలను జిల్లా కలెక్టర్‌కు అందజేశామని చెప్పారు.

**ముస్లింల షాదీ ఖానా నిర్మాణాన్ని అడ్డుకున్న ఈవిఎం ఎమ్మెల్యే**

ఈవీఎం ఎమ్మెల్యే ముస్లింలకు వ్యతిరేకం అని, తన హయాంలో వీరభద్ర నగరం వద్ద పాత కబేలా స్థలంలో స్థలంలో ముస్లింలకు 2500 చదరపు గజాలు( 50 సెంట్లు) షాదీ ఖానాకు కేటాయించానని రూ.50 లక్షల రూపాయల నిధులు కూడా కేటాయించినట్లు తెలిపారు. ఈ స్థలాన్ని ప్రస్తుతం ఈవీఎం ఎమ్మెల్యే ముస్లిములకు కేటాయించలేదని, పనులు కూడా పనులు కూడా ప్రారంభించలేదని, ప్రస్తుత ఎంపీ ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. షాదీ ఖానా నిర్మాణం జరిగేంత వరకు పోరాడుతానని స్పష్టం చేశారు. ఎంపీ వెంట వైసీపీ నాయకులు, మహిళలు కార్యకర్తలు ఉన్నారు.

రైతులు అధిక దిగుబడి నిచ్చే వంగడాలపై

# దృష్టి సారించాలి : శాస్త్రవేత్త చల్లా




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు వ్యవసాయంలో నాణ్యమైన అధిక దిగుబడులు వచ్చే నూతన వంగడాలను ఎంపిక చేసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. సోమవారం మండలంలోని బూరుగుపూడి, దోసకాయలపల్లి గ్రామాలలో "ఖేత్ బచావో అభియాన్" కార్యక్రమంలో రైతులకు నూతన వంగడాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ ఏడిఏ శ్రీనివాసరావు,బూరుగుపూడి సొసైటీ అధ్యక్షులు కంటే నాగ కేశవరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త చల్లా మాట్లాడుతూ నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయ సాంకేతికత, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి విషయాలపై అవగాహన ఏర్పరచుకుని రైతులు పంటలు పండించినట్లయితే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. ఏడిఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యత, యూరియా ఎద్దడి వంటి అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన కొత్త వరి మినికిట్ రకాలైన ఎంటియు 1443, ఎంటియు 1462, ఎంసిఎం 140, ఆర్జిఎల్ 7038, ఆర్జిఎల్ 7062 రకాల లక్షణాలు తెలిపి, రైతులకు మినీకిట్లు వరి విత్తనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ శ్రీనివాసరావు,ఏవో రామ తులసి, సొసైటీ సీఈవో సుదర్శన్, దారా రాము, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ దళితులపై కుట్ర

**మాల సామాజికవర్గం లక్ష్యంగా పన్నాగాలు**

**నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాలమహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ అనేది దళితులను విభజించి వారి హక్కులను కాలరాసేందుకు జరుగుతున్న అతిపెద్ద రాజకీయ కుట్ర అని నేషనల్ ప్రెసిడెంట్ ఫర్ రాక్స్ అండ్ మాలమహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ పేర్కొన్నారు. మండపేట శుభ మస్తు కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ చంద్రబాబే వర్గీకరణకి కారణంగా పేర్కొన్నారు. మాల సామాజికవర్గం లక్ష్యంగా పన్నాగాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై సర్వత్రా వ్యతిరేకత నెలకొందన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, తగిన డేటా లేకుండా రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.ఎస్సీ వర్గీకరణ దళితులపై దేశవ్యాప్త రాజకీయ కుట్ర గా పేర్కొన్నారు.ఎస్సీ వర్గీకరణకు బీజం కాంగ్రెస్ పార్టీ పడితే, దానిని బిజెపి ప్రభుత్వం కూడా కొనసాగించిందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంపై కూడా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. వర్గీకరణ వల్ల కేవలం 4 శాతం మందికే లబ్ధి చేకూరుతుందని, మిగిలిన ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన గణాంకాలతో సహా ప్రశ్నించారు. బిజెపి, మోడీ చంద్రబాబు భాగస్వామ్యం లో దళితులపై కుట్ర చేసారన్నారు. మాల సామాజిక వర్గాన్ని తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు టార్గెట్ చేసి తొక్కేస్తున్నారని వాపోయారు. ఈ ఉద్యమం కేవలం తెలుగు రాష్ట్రాలకే సంబంధించింది కాదన్నారు. దేశం మొత్తానికి సంబంధించిన ఉద్యమన్నారు. భూములు ఈ దేశ సంపద మంత్రి పదవులు, సుప్రీంకోర్టు హైకోర్టు జడ్జిల పదవు ల్లో అక్కరలేదా అని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కుదరదు అని పార్లమెంట్లో చట్టం చేసేంతవరకు నిరంతర శాంతియుత ప్రజాస్వామ్యత పోరాటం కొనసాగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.దశల వారి శాంతియుత ఉద్యమం చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు వినకోటి సూర్యప్రకాష్, ఏలేటి గంగరాజు, కాకిలేటి వీరేంద్ర, గుత్తాల బాపిరాజు, కాళిదాసు పవన్ కుమార్ కొంకి వెంకట్రావు నెల్లి సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పలు గ్రామాల్లో బొడ్డు చేతులమీదుగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలోని పలు గ్రామాల్లో రాజమహేంద్రవరం రూడా ఛైర్మన్ జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి చేతుల మీదుగా పలువురుకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు బొడ్డు తెలిపారు. బూరుగుపూడిలో సబ్బిన బాలాజీ శ్రీనివాస్ కు 50వేలు,కోటారి వీర్రాజుకు లక్ష 46వేల రూపాయల చెక్కును అందించారు.నరసాపురం గుర్రం వెంకట సత్యనారాయణకు 22వేలు,మధురపూడి తిరుమలనాధుని మణికి 23వేలు, బోల్లెద్దుపాలెం సమ్మంగి కనకరాజుకి 30వేల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా బొడ్డు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలబడటం,ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సహాయం అందేలా నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు. లబ్ధిదారులు ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

# శరవేగంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా మండపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని ఓటరు నమోదు అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తంగెళ్ల రాజ రాజేశ్వరరావు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,21,105 మంది ఓటర్లు ఉండగా, సోమవారం సాయంత్రానికి బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) 1,89,894 మంది ఓటర్లకు, లేదా వారి కుటుంబ సభ్యులకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. 85.96 శాతం పంపిణీ జరిగినట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఓటర్ల నుంచి 4,630 ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి అందగా, వాటిని బీఎల్ఓ యాప్‌లో డిజిటలైజేషన్ చేసి నమోదు చేసినట్లు వెల్లడించారు. 2.09 శాతం డిజిటలైజేషన్ జరిగిందన్నారు. సహాయ ఓటరు నమోదు అధికారి, మండపేట తహసీల్దారు పీ తేజేశ్వరరావు నియోజకవర్గంలో పలు గ్రామాలు పర్యటించి సర్ ప్రక్రియను పరిశీలించారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మెహెర్ బాబా, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు పాలనలో గీత వృత్తికి ఆధునిక రూపం



**ఆదరణ-3 పథకం కింద టాడీ టాపర్స్‌కు టీవీఎస్ మోపెడ్‌లు అందించేందుకు కృషి**
**నీరా ప్రాజెక్ట్ విజయవంతానికి కూటమి ప్రభుత్వం విస్తృత చర్యలు : ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు**

**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో నీరా ప్రాజెక్టు అమలు, చేపట్టాల్సిన చర్యలపై ఆంధ్రప్రదేశ్ బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ జి. భీమశంకరరావు తో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ మరియు నీరా టాడీ టాపర్స్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నీరా ప్రాజెక్టు అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం, రుణ సదుపాయాలు, గీత కార్మికులకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన, మార్కెటింగ్ వ్యవస్థ బలోపేతం, ముఖ్యంగా ఆదరణ-3 పథకం కింద టాడీ టాపర్స్‌కు ఆధునిక పనిముట్లతో పాటు టీవీఎస్ మోపెడ్‌లు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశం అనంతరం కుడుపూడి సత్తిబాబు మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమం, సంప్రదాయ వృత్తుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మార్గదర్శకత్వంలో గీత కార్మికుల జీవనోపాధి మెరుగుపడేలా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గీత వృత్తికి ఆధునిక రూపం కల్పించి, గీత కార్మికులకు స్థిరమైన ఆదాయం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నీరా ప్రాజెక్టును అమలు చేస్తోందన్నారు. తాటి, ఈత చెట్ల నుంచి లభించే సహజసిద్ధమైన, ఆల్కహాల్ రహితమైన, పోషక విలువలు అధికంగా ఉండే "నీరా"ను ఆరోగ్య పానీయంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా గీత కార్మికులకు కొత్త ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. నీరాతో పాటు బెల్లం, తేనె, ఇతర విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా గీత కార్మికుల ఆదాయాన్ని మరింత పెంచే అవకాశం ఉందన్నారు. నీరా ఉత్పత్తులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. గతంలో గీత వృత్తి నిర్వహణలో ప్రమాదాలకు గురైన కార్మికులకు తగిన భరోసా లేకపోయినా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రమాద బీమా, ఆర్థిక సహాయం, సంక్షేమ పథకాల ద్వారా వారి కుటుంబాలకు అండగా నిలుస్తోందని చెప్పారు. గీత కార్మికుల భద్రత, సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్న నీరా ప్రాజెక్టు విధానాలను అధ్యయనం చేసి, ఆంధ్రప్రదేశ్‌లో కూడా సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలు, ప్రధాన నగరాల్లో ప్రత్యేక నీరా కేఫ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు నీరా ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. గీత కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, సంప్రదాయ వృత్తులకు నూతన అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సత్తిబాబు స్పష్టం చేశారు.



# బాణాసంచా కేంద్రంపై మండపేట రూరల్ సీఐ ఆకస్మిక తనిఖీ



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లేకుండా భవిష్యత్తులో ఎలాంటి బాణాసంచా తయారీని ప్రారంభించకూడదని మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు హెచ్చరించారు. తూర్పు గోదావరి జిల్లా, రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెదురుపాక సావరం రోడ్డులో ఉన్న శ్రీ భవాని గ్రాండ్ ఫైర్‌వర్క్స్ బాణాసంచా తయారీ కేంద్రంపై మండపేట రూరల్ సీఐ పి. దొరరాజు సోమవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రాయవరం ఎస్సై డి. సురేష్ బాబుతో కలిసి కేంద్రాన్ని తనిఖీ చేసిన సీఐ అక్కడ తయారీ పనులు ఎలాంటివీ జరగకుండా, మూసివేసి ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లేకుండా భవిష్యత్తులో బాణాసంచా తయారీని ప్రారంభించకూడదని కేంద్ర యజమాని సత్తిబాబు ను సీఐ హెచ్చరించారు.

# నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి అధికారులతో సమీక్ష



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షాకాలం కారణంగా ఏర్పడిన గుంతలను అత్యవసరంగా పూడ్చి ప్రజలకు సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వాసు పలు కీలక సూచనలు చేశారు. నగరంలో దెబ్బతిన్న రహదారుల పరిస్థితిపై అధికారులతో సమగ్రంగా చర్చించి, గుంతల పూడ్చివేత పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా పాట్ హోల్స్ అంబులెన్స్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించి ప్రధాన రహదారులపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చాలని సూచించారు. మొదటి దశలో జేఎన్ రోడ్డులో చెరుకూరు సెంటర్ నుంచి రామాలయం జంక్షన్ వరకు, గోరక్షణపేటలో శీలం నూకరాజు జంక్షన్ నుంచి సిమెంట్రిపేట జంక్షన్ వరకు, అలాగే టీటీడీ కళ్యాణ మండపం రోడ్డులో గుంతల పూడ్చివేత పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో రోడ్లపై గుంతల కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు ఈ పనులు అత్యవసరమని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ప్రతి డివిజన్‌లో రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.నగరంలో మౌలిక సదుపాయాల మెరుగుదల, రహదారుల అభివృద్ధి, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ కల్పించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే దిశగా నగర పాలక సంస్థ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

వైయస్ జగన్‌కు

# బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ముద్దాల తిరుపతిరావు (అను) డిమాండ్**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ముద్దాల అను ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ,జగన పై వ్యాఖ్యాలు అభ్యంతరం, వైసిపి చూస్తూ ఊరుకోదని, తక్షణమే పంతం నానాజీ బహిరంగ క్షమాపణ చెప్పాలి. లేని పక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవు తామని ముద్దాల తెలిపారు.



# ఆ రెండు అస్సలు ముట్టుకోను..

## రోజూ 100 గ్రాముల ప్రోటీన్ మాత్రమే తింటా.. డైట్ సీక్రెట్ చెప్పిన సమంత..

చాలా కాలం గ్యాప్ తర్వాత మా ఇంటి బంగారం సినిమాతో సాలిడ్ కంబ్యాక్ ఇచ్చింది హీరోయిన్ సమంత. డైరెక్టర్ నందినిరెడ్డి తెరకెక్కించిన ఈ మూవీ ఇటీవలే అడియన్స్ ముందుకు వచ్చి సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో ప్రధాన పాత్ర మాత్రమే కాకుండా నిర్మాతగానూ వ్యవహరించారు సామ్. అయితే ఇందులో యాక్షన్ సన్నివేశాల్లో సామ్ ఇరగదీసింది. అలాగే చాలా ఫిట్‌గా ... చురుకుగా కనిపించారు. ఈ క్రమంలోనే తన డైట్ ప్లాన్ రివీల్ చేసింది సమంత. 'మా ఇంటి బంగారం' సినిమాతో కంబ్యాక్ ఇచ్చింది సమంత. ఈ మూవీ విడుదలకు ముందు సమంత రూత్ ప్రభు తన భర్త రాజ్ నిడిమోరుతో కలిసి తిరుపతిని సందర్శించారు. ఆ తర్వాత ఆమె ఈ చిత్రం సక్సెస్ సెలబ్రేషన్లలో ఆమె బేబీ బంప్ తో కనిపించడంతో ఆమె ప్రెగ్నెంట్ అనే ప్రచారం మొదలైంది. అయితే, దీనిపై ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు. సమంత చాలా ఆరోగ్యంగా. యాక్టివ్ గా కనిపించారు. తన ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ తీసుకుంటారు. కొన్నాళ్ల క్రితం ఆమెకు మయోసైటిస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఇందుకోసం ఆమె ప్రత్యేక చికిత్స కూడా తీసుకున్నారు. నివేదికల ప్రకారం, పోషకాహార నిపుణురాలు రాశి చౌదరితో ఒక పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో సమంత రూత్ ప్రభు తాను ప్రతిరోజూ పరిమిత మొత్తంలో ప్రోటీన్ తీసుకుంటానని వెల్లడించారు. మయోసైటిస్ చికిత్స తర్వాత తన



ఆహారపు అలవాట్లను మార్చుకున్నానని, సూపర్‌ఫుడ్స్‌ను ఆహారం నుండి తొలగించానని ఆమె తెలిపారు. "నేను 100 గ్రాముల ప్రోటీన్ తీసుకుంటాను, నా బరువు 50 కిలోలు" అని సమంత రూత్ ప్రభు అన్నారు. ఆమె ఈ విషయం చెప్పడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె తన ఆహారం విషయంలో ఎంత శ్రద్ధ వహిస్తుందో ఈ మాటలే తెలియజేస్తున్నాయి. అప్పట్లో తన ఆహారపు అలవాట్ల విషయంలో తాను అంత కఠినంగా ఉండేదాన్ని కాదని సమంత తెలిపింది. ప్రముఖ పోషకాహార నిపుణుడితో జరిగిన ఒక ప్రత్యేక సంభాషణలో, సమంత తన పాఠశాల రోజుల గురించి మనసు విప్పి మాట్లాడింది. అప్పట్లో బరువు పెరగడం గురించి తాను ఎప్పుడూ ఆందోళన చెందనందున, పెద్దగా ఆలోచించకుండా తనకు నచ్చింది తినేదాన్నని ఆమె చెప్పింది. తనకు మయోసైటిస్ అనే అరుదైన ఆటో ఇమ్యూన్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత ఇదంతా పూర్తిగా మారిపోయిందని సమంత రూత్ ప్రభు చెప్పారు. ఆ వ్యాధికి చేసిన చికిత్స ఆహారం పట్ల ఆమె దృక్పథాన్ని పూర్తిగా మార్చేసింది . అది ఆమెకు ఇకపై ఒక చిన్న విషయంగా అనిపించలేదు. అది ఆమె శరీరం పనిచేసే, నయమయ్యే విధానంతో నేరుగా ముడిపడిపోయింది. కోలుకున్న తర్వాత, సమంత యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ డైట్‌ను అనుసరించడం ప్రారంభించింది. ప్రతి ఆహారం నుండి తన శరీరానికి ఏ పోషకాలు అందుతున్నాయో గమనిస్తూ, వాటి పోషక విలువలను బట్టి ఆమె ఆహార పదార్థాలను తినడం మొదలుపెట్టింది. ఆరోగ్యకరమైనవిగా తరచుగా భావించే ట్రెండింగ్ ఫుడ్స్‌ను కూడా ఆమె మానేసింది. సమంత రూత్ ప్రభు తాను ప్రతిరోజూ బ్రకోలీ, క్యాలీఫ్లవర్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ వంటి క్రూసిఫెరస్ కూరగాయలతో పాటు కోల్డ్-ప్రెస్డ్ నూనెలు, నెయ్యి వంటి ఆహార పదార్థాలను తింటానని చెప్పారు. ఆమె తన ఆహారంలో పసుపు, సెలెరీ, అకాయ్ బెర్రీలు వంటి యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ పదార్థాలను తీసుకుంటుంది. ఆమె గ్లూటెన్‌ను పూర్తిగా మానేసింది. సూపర్‌ఫుడ్స్‌గా పరిగణించబడే కొన్ని ఆహారాలు తన శరీరానికి సరిపడవని కూడా ఆమె వెల్లడించింది. "పాలకూర, అరటిపండు వంటి అనేక కూరగాయలు, పండ్లు నాకు సరిపడవు," అని ఆమె చెప్పింది. తన శరీర పరిస్థితికి అనుగుణంగా ప్రతిరోజూ శిక్షణను సర్దుబాటు చేసుకుంటూ, వారానికి నాలుగు నుండి ఐదు సార్లు శిక్షణ తీసుకుంటానని సమంత వివరించింది. కండరాల బలం, మానసిక స్థిరత్వాన్ని కాపాడుకోవడానికి, ఆమె ఒక నిపుణుడి మార్గదర్శకత్వంలో వ్యాయామం చేస్తూ, శక్తి శిక్షణ, శ్వాస, యోగాపై దృష్టి పెడుతుంది.

# సీఎం విజయ్ బర్త్ డే..

## దళపతి ఆస్తులు తెలిస్తే మెంటలెక్కిపోద్ది..





మొన్నటివరకు ఇండస్ట్రీలో తిరుగులేని హీరోగా రాణించిన దళపతి విజయ్ ఇప్పుడు తమిళనాడు సీఎంగా పదవి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీయే ఎన్నికల్లో విజయ్ పార్టీ భారీ మెజారిటీతో విజయం సాధించింది. దాంతో ఇప్పుడు విజయ్ సీఎంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. తమిళ్ స్టార్ హీరో విజయ్ ఇప్పుడు సీఎంగా పదవీబాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం తెలిసిందదే. నటుడి నుంచి రాజకీయనాయకుడిగా మారిన విజయ్ పుట్టిన రోజు నేడు. ముఖ్యమంత్రి అయిన తర్వాత మొదటి బర్త్‌డే అంటే ఎలా ఉండాలి. అద్దిరిపోవాలంటూ తమిళనాడులో తెగ హంగామా చేస్తున్నారు విజయ్ ఫ్యాన్స్. రక్తదానాలు, అన్నదానాలు, సేవా కార్యక్రమాలతో సందడి చేస్తున్నారు. తమ అభిమాన నాయకుడు, నటుడు 52వ పుట్టినరోజుని మరిచిపోలేని విధంగా సెలబ్రేట్ చేస్తున్నారు. ఆలయాల్లో పెద్ద ఎత్తున పూజలు చేస్తున్న టీవీకే కార్యకర్తలు. ఇవాళ పుట్టిన చిన్నారులకు గిఫ్ట్‌లు అందజేశారు. విజయ్ మామ గిఫ్ట్ అంటూ చిన్నారులకు ఉంగరాలు అందజేశారు. బేబి కిట్స్‌ను సైతం తల్లులకు ఇచ్చారు విజయ్ ఫ్యాన్స్. ప్రధాని నరేంద్ర మోదీ కూడా సీఎం విజయ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలంటూ ట్వీట్ చేశారు. విజయ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయనకు సంబంధించిన విషయాలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. వాటిలో విజయ్ ఆస్తుల వివరాలు ఒకటి. ఇటీవల జరిగిన తమిళనాడు ఎన్నికల సమయంలో విజయ్ పెరంబూర్, తిరుచి ఈస్ట్ నియోజకవర్గాలకు నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.. ఈ రెండు చోట్ల విజయ్ ఘనవిజయం సాధించారు. కాగా ఎన్నికల సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తన మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ. 603.20 కోట్లుగా పేర్కొన్నారు. ఆ లిస్ట్ ఒక్కసారి చూద్దాం.! విజయ్ చరాస్తులు: రూ. 404.58 కోట్లు (ఇందులో రూ. 213 కోట్లకు పైగా బ్యాంక్ డిపాజిట్లు ఉన్నాయి). అలాగే స్థిరాస్తులు: రూ.198.62 కోట్లు (కోడైకనాల్‌లో వ్యవసాయ భూమి, చెన్నైలో నివాస, వాణిజ్య సముదాయాలు). అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.184.53 కోట్ల ఆదాయాన్ని ఆ అఫిడవిట్ లో చూపించారు విజయ్. అలాగే విజయ్ దగ్గర చాలా లగ్జరీ కార్లు ఉన్నాయి. ఆయన గ్యారేజీలో దీవీఔ 530, టయోటా లెక్సస్, టయోటా వెల్‌ఫైర్, దీవీఔ ఱ7 వంటి కోట్లు విలువ చేసే కార్లు ఉన్నాయి.

### తనయ్ కెప్టెన్ ఇన్నింగ్స్..

# నల్గొండపై రంగారెడ్డి రైజర్స్ విజయం



టీజీ20 లీగ్ 2026లో భాగంగా నల్గొండ నైట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రంగారెడ్డి రైజర్స్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన నల్గొండ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. ఈ టార్గెట్‌ని రంగారెడ్డి జట్టు 16.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి పూర్తి చేసింది. తనయ్ త్యాగరాజన్ (71; 30 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. ఆదిత్య జవ్వాజి (41; 32 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), అవినాష్ రావు (22; 6 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), నితిన్ సాయి యాదవ్ (26; 9 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. నల్గొండ బౌలర్లలో అనికేత్ రెడ్డి 2, వరుణ్ గౌడ్ 2, నిశాంత్ ఒక వికెట్ తీశారు. అంతకుముందు నల్గొండ బ్యాటర్లలో ఆరో స్థానంలో వచ్చిన దివేశ్ సింగ్ (48; 27 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో హర్షవర్ధన్ సింగ్ (40; 20 బంతుల్లో) మెరుపులు మెరిపించాడు. కెప్టెన్ రాహుల్ బుద్ధి (30), వరుణ్ గౌడ్ (26), పాట్కూరి నితీశ్ రెడ్డి (20) పరుగులు చేశారు. ఓపెనర్లు గౌరవ్ రెడ్డి (0), ప్రణవ్ సూర్యదేవర (7)తోపాటు అర్ఫాన్ అహ్మద్ (7) నిరాశపర్చారు. రంగారెడ్డి బౌలర్లలో పున్నయ్య 3, నితిన్ సాయి యాదవ్ 2, ఆర్యన్ చరియప్ప 2, తనయ్ త్యాగరాజన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# అమన్‌రావు విధ్వంసం

### టీజీ20 లీగ్‌లో తొలి సెంచరీ





టీజీ20 లీగ్ 2026 టోర్నీలో తొలి సెంచరీ నమోదైంది. మెదక్ ఫాల్కన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో వరంగల్ వారియర్స్ ఓపెనర్, కెప్టెన్ అమన్ రావు పేరాల (142; 48 బంతుల్లో 12 ఫోర్లు, 13 సిక్స్‌లు) విధ్వంసం సృష్టించాడు. ఆరంభం నుంచే ఫోర్లు, సిక్సర్లతో విరుచుకు పడ్డ అమన్ 32 బంతుల్లోనే శతకం బాదేశాడు. దీంతో టోర్నీలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా ఘనత సాధించాడు. మ్యాచ్ తొలి ఓవర్ నుంచే భారీ షాట్లతో విరుచుకుపడి స్కోరు బోర్డును పరుగులు పెట్టిస్తూ మెదక్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. తొలి ఓవర్‌లోనే రెండు సిక్సర్లు బాదేసిన అమన్.. తర్వాత కూడా జోరు కొనసాగించాడు. సయ్యద్ ఘాజీ అబ్బాస్ వేసిన ఆరో ఓవర్‌లోనైతే ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. వరుసగా 4, 6, 6, 4, 6, 6 బాదేసి 32 పరుగులు పిండుకున్నాడు. ఈ క్రమంలోనే 17 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తిలక్ వర్మ వేసిన ఏడో ఓవర్‌లో చివరి మూడు బంతులకు వరుసగా 6, 4, 4 కొట్టాడు. రవితేజ వేసిన ఎనిమిదో ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో విరుచుకుపడ్డాడు. సాయి వరుణ్ బౌలింగ్‌లో (9.4 ఓవర్) ఫోర్ బాది అమన్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. తర్వాత సూర్యతేజ బౌలింగ్‌లో మూడు ఫోర్లు, ఓ సిక్స్ కొట్టాడు. చివరకు అమన్ జోరుకు రాహుల్ చెక్ పెట్టాడు. రాహుల్ వేసిన 14.3 ఓవర్‌కు రవి తేజకు క్యాచ్ ఇచ్చాడు. 15 ఓవర్లకు వరంగల్ స్కోరు 216/2.

### 12 ఓవర్లకు 12 పాయింట్లు కోత..

# ఇంగ్లాండ్‌కు ఐసీసీ భారీ షాక్





న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-1తో సమంగా ఉంది. మొదటి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ గెలవగా.. రెండో మ్యాచ్‌లో కివీస్ 253 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రెండో టెస్టుకు రెగ్యులర్ సారథి బెన్ స్టోక్స్ దూరం కాగా.. ఘోర పరాజయం చవిచూసింది. ఈ క్రమంలో ఇంగ్లాండ్‌కు ఐసీసీ గట్టి షాక్ ఇచ్చింది. ఈ జట్టుకు పాయింట్లను తగ్గించింది. ఇప్పటికే పర్సంటేజీ తగ్గగా.. పాయింట్లలోనూ భారీగా కోత పడటంతో డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు మరింత సంక్లిష్టంగా మారాయి. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ఇంగ్లాండ్ ఏడో స్థానంలో ఉంది. ఆదివారం న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో ఇంగ్లాండ్ ఓడిపోయింది. దీంతో డబ్ల్యూటీసీ పట్టికలో ఈ జట్టు పర్సంటేజీ 34.72 నుంచి 26.38 శాతానికి పడిపోయింది. రెండో టెస్టు మ్యాచ్‌కు ముందు ఇంగ్లాండ్ ఖాతాలో 50 పాయింట్లు ఉన్నాయి. కానీ, ఈ టెస్టులో ఏకంగా 12 ఓవర్లను ఆలస్యంగా వేయడంతో 12 పాయింట్లను కోల్పోవాల్సి వచ్చింది. దీంతో పాయింట్ల సంఖ్య 50 నుంచి 38కి తగ్గింది. కెప్టెన్‌గా వ్యవహరించిన జో రూట్‌తోపాటు సహచరులందరికీ మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానాగా పడింది.

**బెన్ స్టోక్స్ వచ్చేశాడు..**

స్వదేశంలో సిరీస్‌ను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో ఉన్న ఇంగ్లాండ్‌కు ఓ గుడ్‌న్యూస్. బాక్సర్‌తో గొడవ కారణంగా రెండో టెస్టు ఆడలేకపోయిన కెప్టెన్ బెన్ స్టోక్స్ మళ్లీ జట్టులోకి వచ్చాడు. కివీస్‌తో మూడో టెస్టు కోసం ప్రకటించిన స్క్వాడ్‌లో అతడికి చోటు దక్కింది. కెప్టెన్ రాకతో తుది జట్టులో ఎవరిని పక్కన పెడతారో చూడాలి. జూన్ 25 నుంచి నాటింగ్‌హామ్ వేదికగా మూడోటెస్టు ప్రారంభం కానుంది.

### టీజీ20 లీగ్: వరంగల్‌తో మ్యాచ్..

# తిలక్ వర్మ స్పెషల్ అట్రాక్షన్

టీజీ20 లీగ్‌లో భాగంగా వరంగల్ వారియర్స్, మెదక్ ఫాల్కన్స్ మధ్య మ్యాచ్ మొదలైంది. టాస్ గెలిచిన వరంగల్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్‌లో స్టార్ క్రికెటర్ తిలక్ వర్మ ఆడుతున్నాడు. తిలక్‌ను మెదక్ జట్టు లీగ్‌లోనే అత్యధిక ధర రూ.33 లక్షలకు దక్కించుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుత సీజన్‌లో ఈ ఒక్క మ్యాచ్‌కే తిలక్ వర్మ అందుబాటులో ఉంటాడు. తర్వాత టీమ్‌ఇండియాతో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనున్నాడు. ఐపీఎల్ 2026లో హైదరాబాద్‌లో మ్యాచ్‌లు ఆడలేకపోయానని, ఇప్పుడు అభిమానుల కోసమే సొంతగడ్డపై మ్యాచ్ ఆడుతున్నట్లు చెప్పాడు.

**వరంగల్ తుది జట్టు:** అమన్ రావు (కెప్టెన్), భవేశ్ సేత్, రిషికేత్ సొసోడియా, హర్షిత్ చౌదరి, మురుగన్ అభిషేక్, మణి కిరణ్, అనిరుధ్ శ్రీవాత్సవ, ఆసిఫ్ మన్సూరి, క్రాంతి పల్లెపాటి, ముదస్సర్ హుస్సేన్, శౌనక్ కులకర్ణి.

**మెదక్ తుది జట్టు:** తిలక్ వర్మ (కెప్టెన్), రవితేజ, నమన్ అగర్వాల్, శృంజిత్ రెడ్డి, విక్రమ్ నాయక్, సూర్య తేజ, సాయి వరుణ్, అనీశ్ రెడ్డి, సయ్యద్ ఘాజీ అబ్బాస్, రాహుల్, మధుకర్ మన్నె.





VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com